భవనం పైనుంచి పడి బాలుడికి గాయాలు



నవ తెలంగాణ-దుబ్బాక

డబుల్ బెడ్ రూమ్ భవనం పైనుంచి పడి బాలుడికి గాయాలైన ఘటన దుబ్బాక పురపాలిక కేంద్రంలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయం వద్ద ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు.. 21వ బ్లాక్ 2వ అంతస్తులోని పదో నెంబర్ రూమ్‌లో గజం కళ్యాణ్ భార్యా పిల్లలతో నివసిస్తున్నారు. కళ్యాణ్ కుమారుడు హేమాన్ష్ (రెండున్నర ఏళ్లు) రెండో అంతస్తు నుంచి కిందనున్న సీసీ రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. బాలుడిని చికిత్స కోసం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై స్పందించిన సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.భాస్కర్ దుబ్బాకలో విలేకరులతో మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాంట్రాక్టర్ లైసెన్సును రద్దు చేసి బ్లాక్ లిస్టులో పెట్టాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాల్లో తగిన రక్షణ చర్యలు చేపట్టాలన్నారు.

నవతెలంగాణ

1



మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

సోమవారం 13 ఫిబ్రవరి 2023

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నవ తెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని ఆదిత్య విద్యాలయ 1995-96 పదో తరగతి విద్యార్థులు ఆదివారం కలుసుకొని గత స్మృతులను గుర్తు చేసుకుంటూ, తమ గురువులను ఘనంగా సన్మానించారు. చిన్నతనంలో తాము చేసిన అల్లరిని ఒకరినొకరు చెప్పుకుంటూ ఆనందంగా గడిపారు. మిత్రులు ఇబ్బందుల్లో ఉన్న వారిని బాధను పంచుకుంటూ గడిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల మాజీ ప్రధానోపాధ్యాయులు కృష్ణ ప్రసాద్, శ్రీనివాస్, కృపకర్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లతరబడి ఎదురుచూపు

- రాజీవ్ గృహకల్ప స్కీంలో డబ్బులు చెల్లించిన పేదలు
- రూ.1.5 కోట్లు చెల్లించిన 216 మంది
- ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి ఇవ్వాలని డిమాండ్
- డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం ఆందోళనలు
- నేడు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఇళ్లులేని పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామంటూ ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ గృహకల్ప పథకం తెచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్‌రూం ఇళ్ల పథకం అమలు చేశారు. పేదలకు మాత్రం ఇప్పటికీ సొంతింటి కల కలగానే మిగిపోయింది. రాజీవ్ గృహకల్ప పథకంలో ఇళ్లిస్తామని చెప్పి అప్పటి ప్రభుత్వం పేదల నుంచి డబ్బులు కట్టించుకుంది. ఇళ్ల నిర్మాణం పూర్తి చేయకుండా వదిలేసింది. తెలంగాణ వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వం కట్టిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను ఇళ్లున్న వాళ్లకు తప్ప ఇళ్లులేని పేదలకివ్వలేదు. రాజీవ్ గృహకల్ప ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి డబ్బులు చెల్లించిన తమకు కేటాయించాలని, లేని పక్షంలో డబుల్ ఇళ్లనైనా కేటాయించాలని పేదలు ఆందోళన చేస్తున్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట పేదలు ధర్నా, ఆందోళన చేయనున్నారు. 2009లో రాజీవ్‌గృహకల్ప పథకం కింద సంగారెడ్డిలో ఇళ్ల నిర్మాణం చేశారు. జీప్లస్ పద్ధతిలో ఇళ్లను నిర్మించారు. ఇళ్లులేని పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు లబ్ధిదారుని వాటాధనంతో కలిపి ఇళ్లు నిర్మించే పథకం అయినందున 440 మంది లబ్ధిదారులతో డబ్బులు కట్టించుకున్నారు. ఇందులోనూ మూడు పద్ధతుల్లో లబ్ధిదారుల నుంచి డబ్బులు కట్టించుకున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయిన మేరకు కొందరికి ఇళ్లు అలాట్‌మెంట్ చేశారు. రూ.49 వేల చొప్పున డబ్బులు కట్టిన 216 మంది పేద లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించలేదు. వాళ్లంతా 14 ఏళ్లుగా డబ్బులు కట్టి ఇళ్ల కోసం ఎదురు చూస్తున్నారు. పట్టణ పేదలు ఇళ్లు కట్టస్తామని ప్రభుత్వం చెప్పగానే ఆశతో ఒక్కొక్కరు రూ.49 వేల చొప్పున చెల్లించారు. అప్పు చేసి కొందరు, పుస్తెమెట్టెలు అమ్మి కొందరు డబ్బులు కట్టారు. లబ్ధిదారులు 1 కోటీ 5 లక్షలా 84 వేలు చెల్లించిన డబ్బులు ఇంత వరకు తిరిగివ్వలేదు. వీళ్లందరూ పేదలే అయినా డబుల్‌బెడ్ రూం పథకంలో ఇళ్లు కేటాయించాలని కోరినా ఇవ్వలేదు. గృహకల్ప, డబుల్‌బెడ్‌రూం రెండు పథకాల్లోనూ ఇళ్లు మంజూరు కాకపోవడంతో పేదలు ఆందోళన బాటపట్టారు. ఇప్పటికే పలుమార్లు సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళనలు చేశారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల్ని కలిసి విన్నవించారు. సోమవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నారు.

అసంపూర్తిగా గృహకల్ప ఇళ్లు

వెలుగు కార్యాలయం వెనక భాగం రెవెన్యూ కాలనీలో నిర్మించిన రాజీవ్ గృహకల్ప ఇళ్లు అసంపూర్తిగా ఉన్నాయి. 440 మందికి ఇళ్లు నిర్మించేందుకు పనులు మొదలుపెట్టి సగం ఇళ్లనే పూర్తి చేశారు. సరిపడ నిధులివ్వకపోవడంతో కాంట్రాక్టర్ పనుల్ని అసంపూర్తిగా వదిలేశారు. దీంతో 250 ఇళ్ల వరకు అసంపూర్తిగా ఉన్నాయి. నిర్మాణం పూర్తయిన ఇళ్లలను కొందరు లబ్ధిదారులకు కేటాయించారు. అక్కడ నీటి వసతి, డ్రైయినేజీ, రోడ్లు, కరెంట్ ఇతర మౌళిక వసతులేకపోవడంతో చాలా మంది లబ్ధిదారులు ఇళ్లల్లో ఉండట్లేదు. సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి డబ్బులు కట్టిన లబ్ధిదారులకు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.

పేదలను విస్మరించే ఉద్యమిస్తాం

పేదల్ని విస్మరించే వైఖరి ప్రభుత్వం వీడాలి. గత ప్రభుత్వం పేదల నుంచి డబ్బులు కట్టించుకుని ఇళ్లు ఇవ్వలేదు. ఈ ప్రభుత్వమైనా పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తదనుకుంటే ఇన్నేళ్లైనా పట్టించుకోవడంలేదు. గృహకల్ప లబ్ధిదారులకు వెంటనే ఇళ్లు కేటా





యించాలి. లేని పక్షంలో పేదలే గృహకల్ప ఇళ్లను స్వాధీనపర్చు కుంటారు. ఇప్పటికే అనేక సార్లు ఆందోళన చేశాం. అధికారులకు విన్నవించాం. డబుల్‌బెడ్‌రూం ఇళ్లను గృహకల్ప లబ్ధిధారులకు ఇవ్వకుండా అనర్హులకు ఇచ్చారు. అధికార పార్టీకి నచ్చిన వాళ్లకే కేటాయించారు. ఇళ్లు కేటాయించిన వారిపై విచారణ జరిపాలి. ఇళ్లు, భూములు ఉన్న వాళ్లకు ఇచ్చిన ఇళ్లను రద్దు చేసి అర్హులైన పేదలకు కేటాయించాలి. గృహకల్ప లబ్ధిదారులకు న్యాయం చేయకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం. ఇళ్లు, స్థలాల సమస్యను పరిష్కరించకపోతే పేదల్ని సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం. ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి. పట్టణంలో ఇళ్లులేని పేదలందరికీ ఇళ్లు, స్థలాలు ఇవ్వాలి.

– ఎం.యాదగిరి, సీపీఐ(ఎం) ఏరియా కార్యదర్శి

ఇళ్లు కట్టివ్వకపోతే స్వాధీనం చేసుకుంటాం



గృహకల్ప ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి డబ్బులు కట్టిన పేదలకు ఇళ్లు కేటాయించాలి. లేకుండా పేదలు స్వాధీనం చేసుకోవాల్సి వస్తది. ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు చేశాం. కలెక్టర్, ఆర్డీఓ, మున్సిపల్ కమీషనర్‌కు విన్నవించాం. 14 ఏళ్లుగా డబ్బులు కట్టి ఎదురుచూస్తున్నారు. గృహకల్ప ఇళ్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించాలి. వాటిని పూర్తి చేసి పేదలకు అలాట్ చేయాలి. లేకుంటే డబుల్‌బెడ్ రూం ఇళ్లనైనా కేటాయించాలి. రూ.49 వేలు కట్టేందుకు పేదలందరూ అప్పులు చేశారు. కొందరు ఇళ్లు వస్తదనే ఆశతో పుస్తె, మెట్టెలు అమ్మి కట్టారు. కలెక్టర్ చొరవ తీసుకొని పేదలకు న్యాయం చేయాలి.

– షబ్బీర్ అహ్మద్, సీపీఐ(ఎం) నాయకులు



రన్నింగ్, వాకింగ్‌తో జీవన శైలిలో మార్పులు

విజయవంతంగా హాఫ్ మారథాన్

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

రన్నింగ్, వాకింగ్ తో మన జీవన శైలిలో మార్పులు వస్తాయని, వీటిని పాటించడం వయస్సుతో పనిలేదని సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎన్ శ్వేత, హుస్నాబాద్ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లో హుస్నాబాద్ పోలీస్ శాఖ, రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన హాఫ్ మారథన్ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాయామం శారీరక దారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. హుస్నాబాద్ యువతీ యువకులు చైతన్య నింపేలా మూడవ ఎడిషన్ ఆఫ్ మారథాన్ రన్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యువతీ యువకులు మహిళలు పురుషులు ప్రతిరోజూ వాకింగ్ రన్నింగ్ చేస్తూ ఆరోగ్యకరమైన జీవితాన్ని పొందాలన్నారు. ప్రతి ఒక్కరు రన్నింగ్ వాకింగ్ అలవాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థినీ విద్యార్థులు రన్ పోటీలలో పాల్గొని, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హుస్నాబాద్ లో చేపట్టిన హాఫ్ మారథన్ రన్‌లో 1800 మందికి పైగా యువతీ యువకులు పాల్గొన్నారు. హుస్నాబాద్ పట్టణంలో 5 కే రన్, 10 కే, 21కే రన్ అక్కన్నపేట వరకు కొనసాగింది. వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, ప్రజా ప్రతినిధులు రన్నర్ లను ఉత్సాహపరిచారు. వందలాదిమంది యువతీ యువకులు రన్నింగులో పాల్గొనడంతో ఆఫ్ మారుథాన్ రన్ విజయవంతంగా ముగిసింది. 21 కె రన్నింగ్‌లో ప్రథమ బహుమతి రమావత్ రమేష్ చంద్ర, ద్వితీయ బహుమతి బొడ్డుపల్లి రమేష్, తృతీయ బహుమతి మజ్జి వేదవ్యాస్, 21 కె మహిళల విభాగంలో ప్రథమ బహుమతి వడ్డె నవ్య, ద్వితీయ బహుమతి జి మహేశ్వరి, తృతీయ పి కామాక్షి, 10 కె ప్రథమ బహుమతి మంచి కంటి లింగన్న, ద్వితీయ బహుమతి రాథోడ్ అనిల్, తృతీయ బహుమతి కరెంటోత్ అనిల్, 10 కె మహిళల విభాగంలో ప్రథమ బహుమతి మర్పల్లి ఉమ, ద్వితీయ బహుమతి ఎండి.సమీరా బేగం, తృతీయ బహుమతి పాయం కుమారి, 5 కెలో ప్రథమ బహుమతి మహమ్మద్ రఫీ, ద్వితీయ బహుమతి అభిషేక్, తృతీయ బహుమతి కే అనిల్, మహిళల విభాగంలో 5 కె రన్‌లో ప్రథమ బహుమతి ఎం.విశాలాక్షి, ద్వితీయ బహుమతి డి.కళ్యాణి, తృతీయ బహుమతి బానోతు హరిత లకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేతారెడ్డి, ఎమ్మెల్యే సతీష్ కుమార్ అందజేశారు. ప్రశంసాపత్రం, మెడల్స్ అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ మహేందర్, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత, హుస్నాబాద్ ఏసీపి సతీష్, సీఐ కిరణ్,ఎస్బి ఇన్స్పెక్టర్ రఘుపతి రెడ్డి, ఎస్ఐ మహేష్ కుమార్, అక్కన్నపేట ఎస్ఐ వివేక్, కోహెడ ఎస్ఐ నరేందర్ రెడ్డి, అక్కన్నపేట జెడ్పిటిసి భూక్య మంగ, ఎంపీపీ లక్ష్మి,హుస్నాబాద్ రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షులు అమ్మి గల రమేష్, ఉపాధ్యక్షులు బొడుమల్ల సంపత్ సెక్రెటరీ మహేందర్ శ్రీనివాస్, తిరుపతి, వెంకట్ నర్సయ్య, సిద్దిపేట ఏసిపి దేవా రెడ్డి, స్థానిక కౌన్సిలర్ లు సర్పంచులు ప్రజా ప్రతినిధులు యువతీ యువకులు పాల్గొన్నారు.

అధైర్యపడొవద్దు

నవ తెలంగాణ-రాయపోల్

అధైర్య పడవద్దు అండగా ఉంటామని, బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ కార్యకర్తలకు వెన్నంటి ఉంటుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మామిడి మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయపోల్ మండలం టెంకంపేట్, తిమ్మక్ పల్లి గ్రామాలలో బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టెంకంపేట్ మాజీ సర్పంచ్ తిరుపతి నర్సింలు తండ్రి తిరుపతి లక్ష్మయ్య మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే తిమ్మక్ పల్లి గ్రామంలో పొట్టెల కనకయ్య వ్యవసాయ పొలంలో హఠాత్తుగా మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ఆర్థిక సహాయం చేయడం జరిగిందన్నారు. వీరి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. అధైర్య పడవద్దని అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి, నాయకులు స్వామి, మధు, సింగరబోయిన స్వామి, శ్రీనివాస్ చారి, ఆత్మ కమిటీ డైరెక్టర్ జగపతి రెడ్డి, మురళి, భాను , శ్రవణ్, చింటు, గణేష్, తుప్పతి ప్రవీణ్, తుడుం ప్రశాంత్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మెట్ల పైనుంచి పడి వృద్ధుడి మృతి

నవతెలంగాణ-దుబ్బాక/దుబ్బాక రూరల్



మెట్లపైనుంచి పడి వృద్ధుడు మృతి చెందిన ఘటన దుబ్బాక పరిధి లోని అక్బర్ పేట భూంపల్లి మండలం చిట్టాపూర్ లో శనివారం జరిగింది. భూంపల్లి పోలీసులు తెలిపిన వివరాలు... ఇదే గ్రామానికి చెందిన పెంటి రాజలింగం తండ్రి నారాయణ (65) వృత్తిరీత్యా కూలి పని చేస్తున్నాడు. ఈ నెల 9న ఇంటి మెట్లు ఎక్కుతున్న క్రమంలో ప్రమాద వశాత్తు కాలుజారి కిందపడడంతో తలకు గాయాలయ్యాయి. చికిత్స కోసం వెంటనే సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న రాజలింగం ఈనెల 11న మృతి చెందాడు. మృతుడి కుమారుడు పెంటి నవీన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని భూంపల్లి పోలీసులు తెలిపారు.

శాసన మండలి డిప్యూటీ స్పీకర్‌కు శుభాకాంక్షలు



నవ తెలంగాణ-రాయపోల్

రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ స్పీకర్గా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మెల్సీ బండ ప్రకాష్ ముదిరాజ్‌ను ఆదివారం అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇప్ప దయాకర్ కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తున్నారని దానిలో భాగంగానే ముదిరాజ్ బిడ్డ అయిన ఎమ్మెల్సీ బండ ప్రకాష్ గారికి శాసనమండలి డిప్యూటీ స్పీకర్గా అవకాశం కల్పించారు. 2021 నేతి విద్యాసాగర్ పదవి కాలం పూర్తయిన తర్వాత డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీగా ఉండడంతో బండా ప్రకాష్ గారికి అవకాశం కల్పించారు. సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న క్రీడలు



నవ తెలంగాణ-దౌల్తాబాద్

శ్రీ చాముండేశ్వరి గురు దత్త పీఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ దొమ్మాట గ్రామంలో ఆదివారం రెండో రోజూ కొడకండ్ల శ్రీరామ వరుణ్ శర్మ, మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షురాలు పూజిత వెంకటరెడ్డి ప్రారంభించారు. దొమ్మాటలో ఈ నెల 14వ తేదీ వరకు జరిగే మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో గాజులపల్లి సర్పంచ్ అప్పవారి శ్రీనివాస్, స్థానిక ఎంపీటీసీ గన్నమనేని లక్ష్మీ మోహన్ రావు, దొమ్మాట ఉప సర్పంచ్ ఈదన్న గారి సింహాచలం, వార్డు సభ్యులు కనకయ్య ,నర్సింలు, ఏఈఓ సంతోష్ కుమార్, క్రికెట్ టీం కెప్టెన్లు గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో మర్కూక్

- గ్రామాల్లో జోరుగా బెల్టు షాపులు
- 24 గంటలూ అందుబాటులో లిక్కర్
- ఏరులై పారుతున్న మద్యం
- రోడ్డుపాలవుతున్న కుటుంబాలు
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

నవతెలంగాణ-మర్కూక్

మర్కూక్ మండల పరిధిలోని 16 గ్రామాలున్నాయి. వీటిలో సీఎం దత్తత తీసుకున్న ఎర్రవల్లి, నర్సన్నపేట మద్యరహిత గ్రామాలు. మిగతా 14 గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్టుషాపుల్లో 24 గంటలపాటు మందు అందుబాటులో ఉంటోంది. అక్రమ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతున్నది. నిబంధనలకు విరుద్ధంగా, మద్యం పాలసీకి వ్యతిరేకంగా మర్కూక్ మండలలోని గ్రామాల్లో గల్లీల్లో రేయింబవళ్లు మద్యం అందుబాటులో ఉంచుతున్నారు. కట్టడి చేయాల్సిన అధికారులు నోరు మెదపకపోవడంతో ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయిస్తున్నారు. మద్యం ప్రియుల జేబులకు చిల్లు కొడుతూ బెల్టుషాపుల నిర్వాహకుల అక్రమ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరుకాయలుగా కొనసాగుతున్నది. అధికారికంగా మద్యం దుకాణాలను పొందినవారే గ్రామాలకు మద్యాన్ని సరఫరా చేయాలి. బెల్టు షాపుల నిర్వాహకుల ద్వారా విక్రయించి అధిక లాభాలను గడిస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. వైన్స్ షాపు నుంచే గ్రామాలకు మద్యం సరఫరా అవుతుంది. బెల్టుషాపుల నిర్వాహకుల నుంచి ఎంఆర్‌పీ కంటే అధనంగా డబ్బులు తీసుకుని ఎవరైనా వస్తే తాము చూసుకుంటామని, మీరు నిశ్చతంగా మద్యం విక్రయాలు చేయాలని భరోసా ఇస్తున్నట్లు సమాచారం. బెల్టుషాపుల నిర్వాహకులు ఆటోలలో, ద్విచక్ర వాహనాలపై మద్యం బాటిళ్లను బహిరంగంగానే తీసుకెళ్తున్నా కట్టడి చేసేవారే కరువయ్యారు.

అధికారుల అండదండలు

ఎక్సైజ్ అధికారుల కనుసన్నల్లోనే నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల్లో బెల్టు షాపుల ఏర్పాటు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని తెలుస్తోంది. ప్రతి గ్రా మంలో 24 గంటలపాటు బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. ఒక్కో గ్రామంలో సుమారు 8 నుంచి 11 వరకు బెల్టు షాపులు ఉన్నాయంటే అధికారుల అలసత్వం ఏపాటిదో తెలుస్తోంది.



వైన్స్ షాపుల ఉన్నా..

ప్రభుత్వం నిర్ణయించిన మద్యం దుకాణాల పరిధిలో బెల్టుషాపుల నిర్వహణ తప్పనిసరిగా మారింది. వైన్స్‌షాపుల నిర్వహణ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు నిర్వహించాలి. వైన్స్‌షాపులు మూసేసిన తర్వాత కూడా బెల్టు షాపు రూపంలో మద్యం విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఎంఆర్‌పీ కంటే అదనంగా క్వాటర్ బాటిల్‌పై రూ.40 నుంచి రూ.50 వరకు, బీరు బాటిల్‌పై అదనంగా రూ.60 వరకు వసూలు చేస్తున్నారు. మద్యం ప్రియులు సైతం చేసేదిలేక అధిక ధరలకు మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.



ఏడ పడితే ఆడ..

ఏడ పడితే ఆడ.. తాగినోళ్లకు తాగినంత.. గ్రామాలలో మందు మస్తుగా దొరుకుతున్నది. ఏ ఊర్లె చూసినా, ఏ సందులో చూసినా బెల్టుషాపులు పుట్టగొడుగుల్లెక్క వెలుస్తున్నయ్. పొద్దుమాపనే తేడా లేకుండా ఖుల్లా పెడ్తున్నరు. జనం తిప్పలు పడుతున్నా అదేం పట్టన్నట్లు ఆబ్కారీ శాఖ గల్లీ గల్లీకి బెల్టుషాపులను ప్రోత్సహించడంతో ప్రతి ఊరిలో సగటున పదికిపైగానే బెల్టుషాపులు రన్ అయితున్నయ్. కిరాణా షాపుల్లోనూ కావాల్సిన లిక్కర్ బ్రాండ్స్ దొరుకుతున్నయ్. కొన్ని చోట్ల తాగాలనుకున్నోళ్లు ఫోన్ కొట్టడమే ఆలస్యం... బెల్టుషాపుల నుంచే డోర్ డెలివరీ చేస్తున్నారు.

రోడ్డున పడుతున్న కుటుంబాలు

మద్యానికి బానిసైనవారు ఇంట్లో ఏ వస్తువుంటే అది అమ్మి మద్యం తాగి కుటుంబ సభ్యులతో గొడవకు దిగుతున్నారు. అనవసర కలహాలతో అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అదికారులు చర్యలు చేపట్టి బెల్టు షాపులు నడవకుండా అడ్డుకట్ట వేయాలను ప్రజలు కోరుతున్నారు.

చర్యలు చేపడుతాం

గ్రామాలలో బెల్లు షాపులలో అమ్మితున్న విషయం తమ దృష్టి రాలేదు. బెల్టు షాపులలో మద్యం అమ్మితే కఠిన చర్యలు తప్పవు. బెల్టు షాపులపై రైడింగ్ నిర్వహించి, కేసులు పెట్టి తగిన చర్యలు తీసుకుటాం.

– శ్రీనివాస్‌రెడ్డి. ఆబ్కారీ శాఖ ఎస్ఐ

తిరుమలాపూర్‌లో కనువిప్పు

నవ తెలంగాణ-దౌల్తాబాద్



పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం పోలీస్ కళాబృందం సభ్యులు బాల్ నర్స్, రాజు, రవీందర్, తిరుమల, కానిస్టేబుల్ రాజు, హోమ్ గార్డ్ బాలరాజ్ దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిరుమలాపూర్ గ్రామంలో కనువిప్పు కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా దౌల్తాబాద్ ఎస్ఐ చైతన్య రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పలు అంశాలను ఎల్ఈడి స్క్రీన్ వీడియో, ఆడియో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాగ్య ఎల్లం,ఏఎస్ఐ సాయిలు,మరియు ప్రజలు, ప్రజా ప్రతినిధులు, మరియు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేయండి

నవ తెలంగాణ-రాయపోల్



'రక్తదానం మహాదానం. అన్ని దానాలలోకెల్ల రక్త దానం చాల గొప్పది. ప్రాణాలు కోల్పోయే స్థితి నుంచి ఎంతోమంది ప్రాణాలను రక్షించొచ్చు. రక్తదానం చేయండి. ప్రాణదాతలుగా నిలవండి' అని సామాజిక సేవకురాలు, ఇందుప్రియాల్ అంగన్వాడీ టీచర్ మహమ్మద్ సుల్తానా ఉమర్ అన్నారు. ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్న సుల్తానా ఉమర్ రక్తదానం చేసి ప్రాణాలను కాపాడారు. ఆదివారం ఆర్వీఎం ఆస్పత్రిలో జమ్మికుంటకు చెందిన మహిళ చికిత్స పొందుతుండగా అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం ఉన్నదని ఫోన్ ద్వారా వచ్చిన సమాచారానికి ఆమె స్పందించారు. వెంటనే ఆర్వీఎం ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు వెళ్లి రక్తం దానం చేశారు. ఈ సందర్భగా ఆమె మాట్లాడుతూ అత్యవసర సమయంలో రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-కోహెడ



మండలంలోని మైసంపల్లి గ్రామానికి చెందిన అందె లచ్చవ్వ ఇటీవల మరణించగా ఆదివారం ఆమె కుటుంబ సభ్యులకు గ్రామ సర్పంచ్ రవీందర్‌గౌడ్, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు పోలవేని కుమార స్వామిలు మూడు వేల ఆర్థికసాయాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వల్లపు మల్లేష్, ఎనగందుల శ్రీనివాస్, వేముగంటి సాయి, తదితరులు ఉన్నారు.

ఆడబిడ్డలకు పుస్తె మట్టెల పంపిణీ

నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని బైరాన్‌పల్లి గ్రామానికి చెందిన మయోజు పోశాద్రి, జనవ్వల కవల ఆడబిడ్డలు శివాని, భవానిలకు బైరాన్‌పల్లి సర్పంచ్ బండి శ్రీనివాస్ గౌడ్ ఆదివారం పుస్తె మట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో పేద బిడ్డలకు తన వంతుగా పుస్తె మట్టెలను అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బండి వసంత, కాంగ్రెస్ కార్యకర్త బ్రహ్మాచారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



నవ తెలంగాణ - సిద్దిపేట

నిరుపేద కుటుంబానికి చెందిన ప్రసన్న వివాహ సందర్భంగా నల్ల నాగరాజం- కృష్ణవేణి సహకారంతో పుస్తె మట్టెలు, చీర అందించినట్లు వాసవీ క్లబ్ అధ్యక్షులు చింత రాజేంద్రప్రసాద్ తెలిపారు. డిస్టిక్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సోమ శివకుమార్, జోన్ చైర్మన్ సోమ వనజ, పీఆర్వో అయిత శంకర్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు తొడుపునూరి కృష్ణవేణి, వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు అరవపల్లి హరికిరణ్, జూలూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల పరిదిలోని ఇటిక్యాల గ్రామంలో శ్రీపతి సత్యమ్మ నర్సయ్య దంపతుల కూతురు రజిత వివాహానికి ఆర్బీపీ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ ఇటిక్యాల సర్పంచ్ చంద్రశేఖర్ గుప్తా తన సొంత ఖర్చులతో పుస్తె మట్టెలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యులు శ్యామల నర్సింలు బాలమణి అంజనేయులు ముదిరాజ్ పెద్దమనుషులు పెద్దోళ్ల వెంకటయ్య, శ్రీపతి నర్సింలు, శ్రీపతి కిష్టయ్య యూత్ నాయకులు భాస్కర్ నరేష్ కొండపోచమ్మ మాజీ డైరెక్టర్ దొడ్డి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి దేవస్థానం వరకు సైకిల్ యాత్ర

నవతెలంగాణ-నంగునూరు



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు పుట్టినరోజును పురస్కరించుకుని, ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ల జీవించాలని కోరుతూ కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి (తిరుమల తిరుపతి వెంకన్న దేవస్థానం) వరకు సైకిల్ యాత్ర చేపట్టారు. కోహెడ మండలం వెంకటేశ్వరపల్లి గ్రామం పీవీ నరసింహారావు కాలనీకి చెందిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుడు, బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పిడిశెట్టి రాజు సైకిల్‌యాత్ర చేపట్టారు. సీఎం కేసీఆర్‌కు ఇష్ట దైవమైన నంగునూరు మండలం కొనాయిపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి గ్రామ సర్పంచ్ అరగొండ వెంకటేశం, బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డిలు ఆదివారం జెండా ఊపి రాజు సైకిల్ యాత్ర ప్రారంభించారు. అనంతరం రాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో, బంగారు తెలంగాణ నిర్మాణంలో అనేక సంక్షేమ పథకాలు చేపట్టి అనేక రంగాల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌కు మంచి జరగాలని, వారు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ల జీవించాలని రాజు ఆ భగవంతుడిని వేడుకున్నారు. అదేవిధంగా గతంలో రాష్ట్రం ఏర్పడిన నుండి నేటివరకు కేసీఆర్ ప్రతి పుట్టిన రోజు వేములవాడ నుండి ప్రగతి భవన్ వరకు పాదయాత్ర ,సైకిల్ యాత్ర చేశామని రాజు తెలియజేశారు. ఈకార్యక్రమంలో కొనాయి పల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ అరగొండ వెంకటేశం,మండల ప్రధాన కార్యదర్శి నిమ్మ శ్రీనివాస్ రెడ్డి ,ఉప సర్పంచ్ ,వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నవ తెలంగాణ-మిరుదొడ్డి

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎంపీపీ గజ్జల సాయిలు, ఆత్మ కమిటీ చైర్మన్ భాస్కరాచారి, టీఆర్ఎస్ జిల్లా నాయకులు సుకురి లింగం అన్నారు. ఆదివారం మిరుదొడ్డి మండలం పెద్ద చెప్యాలా గ్రామంలో ఎల్లమ్మ, పెద్దమ్మ దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముదిరాజ్ కమ్యూనిటీ హాల్‌కు రూ.పది లక్షలు, ఎల్లమ్మ దేవాలయం వద్ద కమ్యూనిటీ హాల్‌కు రూ.ఐదు లక్షలు మంజూరైనట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డికి చెప్యాల కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లాల సత్యనారాయణ, టీఆర్ఎస్ జిల్లా నాయకులు బాపురెడ్డి, ఏఎంసి వైస్ చైర్మన్ మల్లేశం గౌడ్, అంజిరెడ్డి, నిమ్మ నితిన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నామా రవి కిరణ్ వివాహ వార్షికోత్సవం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ నామ రవి కిరణ్ దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఎంపీ బీబీ పాటిల్, ఎమ్మెల్యే మాణిక్యరావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ తన్వీర్‌లు వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పూలమాలలు శాలువలు కప్పి రవికిరణ్‌ను అభినందించారు. రైల్వే బోర్డు సభ్యులు షేక్ ఫరీద్, సీడీసీ చైర్మెన్ ఉమాకాంత్‌పాటిల్, బాల్ రెడ్డి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు దైవభక్తిని పెంపొందించుకోవాలి



నవతెలంగాణ-అమీన్‌పూర్

ప్రజలందరూ దైవభక్తిని పెంపొందించుకోవాలని పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్పూర్ మండలంలోని పటేల్‌గూడా గ్రామంలో ఆదివారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తెలంగాణ చరిత్రలో గ్రామ దేవతలకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. అమీన్పూర్ ఎంపీపీ దేవానందం, జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ నితీశా శ్రీకాంత్, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వివిధ శుభకార్యాలకు హాజరైన ఎంపీ, ఎమ్మెల్యే



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలో ఆదివారం జరిగిన వివిధ శుభకార్యాల్లో జహీరాబాద్ ఎంపి బి.బి పాటిల్, ఎమ్మెల్యే మాణిక్ రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ తన్వీంలు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్, సీడీసీ చైర్మెన్ ఉమా కాంత్ పాటిల్, సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్‌లు యువ నాయకులు పాల్గొన్నారు.

బండ ప్రకాష్‌కు శుభాకాంక్షలు తెలిపిన పట్నం మాణిక్యం



నవతెలంగాణ-సంగారెడ్డి

శాసనమండలి డిప్యూటీ చైర్మెన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన బండ ప్రకాష్‌ను డీసీసీబీ వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం ఆదివారం హైదరాబాద్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హైదరాబాద్ అసెంబ్లీ వద్ద తెలంగాణ స్తూపానికి పూలమాల వేశారు. బీఆర్ఎస్‌తోనే సబ్బండ కులాలకు న్యాయం జరుగుతుందన్నారు.

మల్లికార్జున ఆలయానికి విరాళం



నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని శివనగర్ గ్రామంలో గత సంవత్సరం తన సొంత డబ్బులతో నిర్మించిన మల్లికార్జున స్వామి దేవాలయానికి రంగులు వేయటానికి గాను జాతర ఉత్సవంలో భాగంగా పటాన్చెరు ఎమ్మెల్యే ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రూ.85,000 విరాళంగా ఆదివారం అందించారు. అలాగే జాతర ఏర్పాట్ల కోసం సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్ రూ.10,000 అందజేశారు. ఈ కార్యక్రమంలో గుడిగ శివరాజ్, మల్లెల కృష్ణ, గుడిగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చింతా ప్రభాకర్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-సదాశివపేట

మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ త్వరగా కోలుకోవాలని సదాశివపేటలోని అయ్యప్ప స్వామీ ఆలయంలో శ్రీ అయ్యప్ప సేవా సమితి వారి ఆధ్వర్యంలో ఆదివారం అభిషేకం చేయించారు. ఇక ముందు కూడా ఆరోగ్యంగా ఉండి ప్రజలకు సేవలు అందించాలని అయ్యప్ప స్వామిని వేడుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ చింత గోపాల్, బీఆర్ఎస్ కౌన్సిలర్ ప్రకాష్ చౌదరి, బీఆర్ఎస్ పట్టణ యువత అధ్యక్షులు బిట్ల ప్రేమ్ కుమార్, డాకుర్ అశోక్ గౌడ్,ఆకుల సుదర్శన్ రెడ్డి, మురళి గౌడ్, గురుస్వాములు గోనె శంకర్, నల్ల జయరాములు గౌడ్, నాయుడు గురుస్వామి, చెన్నార్, పలువురు బిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న రోషన్ రెడ్డి



నవతెలంగాణ-నారాయణఖేడ్

మండలంలోని సంజీరావుపేట్ గ్రామానికి చెందిన రాములు కుమార్తె వివాహం గ్రామంలోని అనంత పద్మనాభ స్వామి ఆలయంలో ఆదివారం జరిగింది. ఈ వేడుకకు ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తనయుడు, యువ నాయకులు రోషన్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఎంపీటీసీ భూపాల్, సర్పంచ్ యంబరి విట్టల్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు ఉమ్మిల్ల పోచయ్య, పార్టీ నాయకులు దస్తయ్య, సాగర సంఘం జిల్లా యువత అధ్యక్షులు లక్ష్మణ్ సాగర్, రమేష్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్‌కు నేడు క్రీడాకారుల ఎంపిక

నవతెలంగాణ-సంగారెడ్డి

ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 15, 16వ తేదీన హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో సీఎం కప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు(సోమవారం) సంగారెడ్డి అంబేద్కర్ క్రీడా మైదానంలో పురుషుల, మహిళల వాలీబాల్ సెలక్షన్ ఎంపిక నిర్వహించనున్నట్టు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టి.స్వరాజ్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు నేటి ఉదయం 9 గంటలకు అంబేద్కర్ స్టేడియం గ్రౌండ్‌కు హాజరుకావాలన్నారు. ఈ వాలీబాల్ సెలక్షన్‌లో, పోటీలల్లో కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ క్రీడాకారులు పాల్గొనకూడదన్నారు. పూర్తి వివరాల కోసం సంగారెడ్డి జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి టి.స్వరాజ్ 9440103665, సంయుక్త కార్యదర్శి కిష్టయ్య 9949005584, మెదక్ జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు ఐత పరంజ్యోతి 9440415564, సిద్దిపేట జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి రవీందర్ రెడ్డి 8008384850లను సంప్రదించాలన్నారు.

గంగమ్మ దేవాలయం వద్ద గజస్తంభ ప్రతిష్టాపన



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ జోగిపేట మున్సిపాల్టీ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హౌసింగ్ బోర్డ్ కాలనీ వద్ద గల గంగమ్మ దేవాలయంలో గజస్తంభన ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో మత్స్యకారులు ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జోగిపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డి.బి నాగభూషణం, పట్టణ మత్స్య పరిశ్రమ సహకార సంఘం అధ్యక్షులు నాగరాజు, సంఘ సభ్యులు జోగయ్య, జలగరి యాదగిరి, శ్రీనివాస్, వెంకటేశం, నాగులపల్లి దశరథ్, దానయ్య, శ్రీను, సంతోష్, లడ్డు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మాజీ పట్టణాధ్యక్షుడి ఇంట్లో చోరీ



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని మూసానగర్ కాలనీలో గల బీజేపీ మాజీ పట్టణ అధ్యక్షుడు మాణిక్యప్ప ఇంట్లో శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడి 10 తులాల బంగారంతో పాటు నగదును అపహరించుకుపోయారు. జహీరాబాద్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మాణిక్యప్ప కుటుంబం గత రెండు రోజుల క్రితం సంగారెడ్డిలో మరో ఇల్లు కొనుగోలు చేయడంతో అక్కడ నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. ఆదివారం ఉదయం వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఇంట్లోని బీరువాలో ఉన్న బంగారం, నగదును దుండగులు ఎత్తికెళ్లారు. ఈ మేరకు మాణిక్యప్ప ఫిర్యాదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

వివాహ వేడుకల్లో పాల్గొన్న యువనేత సాగర్ షెట్కార్



నవతెలంగాణ-నారాయణఖేడ్

ఖేడ్ మండలంలోని పంచాగమ గ్రామానికి చెందిన శ్రీశైలం స్వామి కూతురి వివాహ వేడుకలో యువనేత సాగర్ షెట్కర్ పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ నారాయణఖేడ్ పట్టణాధ్యక్షులు సాయిలు పటేల్, నర్సింలు మాజీ ఎంపీటీసీ, అంత్వార్ సంగమేశ్వర పటేల్, మల్లయ్య స్వామి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నష్టానికి అమ్మలేక.. పూటగడవక

పత్తిరైతు అరిగోస..

- ఇండ్లల్లోనే పేరుకుపోతున్న తెల్లబంగారం
- నల్లబడుతోందని రైతుల భయాందోళన
- గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్



నవతెలంగాణ-మునిపల్లి

తెల్ల బంగారం పండించిన రైతులకు ఈయేడు కన్నీళ్లే మిగిలాయి. పంట చేతికొచ్చి రోజులు గడుస్తున్నా.. సరైన ధరలేకపోవడంతో ఇండ్లల్లోనే మగ్గుతున్నది. ప్రస్తుతం ఉన్న ధరకు విక్రయిస్తే.. కనీసం పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని అన్నదాత ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. అప్పులు కుప్పలు తీర్చే మార్గం తెలియక ప్రాణాలు తీసుకుంటున్నాడు. ఇప్పటికైనా సర్కార్ స్పందించి.. గిట్టుబాటు ధర కల్పించి పత్తిని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో రైతులు ప్రధానంగా పత్తి సాగువైపే మొగ్గు చూపారు. ఆశించినంత దిగుబడులు రాకున్నప్పటికీ.. సాగు విస్తీర్ణం మాత్రం గణనీయంగా పెరిగింది. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా పత్తి ధర పడిపోవడంతో చేతికొచ్చిన పత్తిపంట రైతుల ఇళ్లలోనే నిల్వకుంటున్నది. రేపో, మాపో పెరుగుతుందని గత కొన్ని రోజులుగా రైతాంగం ఆశగా ఎదురుచూస్తున్నా.. ధరలు మాత్రం పెరగడం లేదు. మొదట్లో ఊరించినా.. ఆ తరువాత ఒక్కసారిగా ధరలు పడిపోయాయి. భారీ వర్షాలతో పత్తి తెగుళ్ల బారిన పడి దిగుబడి రాలేదు. వచ్చిన దిగుబడినైనా అమ్ముకొందామంటే, వ్యాపారులు ముఖం చాటేస్తున్నారు. గ్రామాల్లోకి వస్తున్న దళారులు గతేడాది కంటే సగం ధరకు అడుగుతుండడంతో రైతులు దిగులు పడుతున్నారు. పత్తి సీజన్ ప్రారంభంలో క్వింటాల్‌కు రూ. 10 వేల నుంచి 14వేల వరకు పలికింది. ధర పెరుగుతున్న క్రమంలో దళారులు, వ్యాపారులు కొనుగోళ్లు నిలిపివేశారు. దీంతో మార్కెట్లో ధర ఒక్కసారిగా రూ.7200కు పడిపోయింది. దీంతో ఈ సగం ధరకు అమ్ముకోలేక రైతులు పత్తిని ఇంట్లోనే నిల్వ చేశారు. కాగా నాటి నుంచి ధర పెరగకపోవడంతో చేతికొచ్చిన పంట కూడా రోజులు తరబడి ఇంట్లోనే మగ్గుతున్నది. ఎక్కువ రోజులైతే పత్తి నలుపు రంగులోకి మారుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎకరా పత్తి పండించడానికి సుమారుగా 50 వేల వరకు పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని.. అంటే సుమారుగా ఒక క్వింటల్‌కి రైతుకు పదివేల ఖర్చు వస్తుంది. అయితే ఇప్పుడు మార్కెట్లో క్వింటాల్‌కి రూ.7000 చొప్పున మాత్రే ధర పలుకుతున్నది. సుమారుగా రైతుపై ఒక్క ఎకరాకే వేలల్లో నష్టం వస్తున్నది. నష్టానికి పత్తి అమ్ముకోలేక.. ఇంట్లోనే రోజుల తరబడి పత్తిని నిల్వ చేసుకోలేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట మొత్తం ఇంట్లోనే ఉండడంతో పూట గడవడం కూడా కష్టమైతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాగు కోసం తెచ్చిన అప్పులు తడిసి ముద్దయిపోతున్నాయని వాపోతున్నారు. కాగా అప్పుల కుప్పలు తీర్చే మార్గం తెలియక.. ఇటీవలే మునిపల్లి మండలంలోని ఖమ్మం పల్లి గ్రామానికి చెందిన రైతు ఆత్మహత్యయత్నం చేసుకున్నాడు. ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం తక్షణమే స్పందించి.. క్వింటాలకు రూ.15,000 చొప్పున ధర కల్పించాలని కోరుతున్నారు.



బీసీలకు పెద్దపీట వేస్తోన్న సీఎం

నవతెలంగాణ-పటాన్‌చెరు

ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీలకు పెద్దపీట వేసి ప్రాధాన్యం కల్పిస్తున్నారని, దీనికి నిదర్శనమే ఎమ్మెల్సీ బండా ప్రకాష్‌కు శాసన మండలి వైస్ చైర్మెన్‌గా అవకాశం కల్పించడం అని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం శాసనమండలి వైస్ చైర్మెన్‌గా బండా ప్రకాష్ ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండా ప్రకాష్‌ను కలిసి పుష్ప గుచ్చం ఇచ్చి శాలువా కప్పి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఐటీ, మున్సిపల్ శాఖా మంత్రి కేటీఆర్, మండలి చైర్మన్ గుప్తా సుఖేందర్ రెడ్డి,ఎమ్మెల్సీ కవితలను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మధు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలో అన్ని వర్గాలకు సమప్రాధాన్యం ఇస్తూ, సంక్షేమ పథకాలు, అభివృద్ధి ని జోడెద్దుల మాదిరిగా పరుగెత్తిస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తూ మరోపక్క బీఆర్ఎస్ స్థాపించి దేశ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించనున్నారన్నారు. త్వరలోనే దేశంలోనే బీఆర్ఎస్ రాజకీయ సంచలనం సృష్టిస్తుందన్నారు. ఈ దిశగా ముందుకు వెళ్ళేలా ప్రజలందరూ సహకరించి కేసీఆర్‌ను ఆశ్వీరదించాలని కోరారు.

శరవేగంగా డివిజన్ల అభివృద్ధి

- నాడు కాలుష్యకారకాలతో.. నేడు అభివృద్ధికి ప్రతీకగా పటాన్‌చెరు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినప్పుడే వారి గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకోవచ్చని, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిహెచ్ఎంసి పరిధిలోని మూడు డివిజన్లలో వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ కార్పొరేటర్‌గా మెట్టుకుమార్ యాదవ్ ఎన్నికై రెండేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం రాత్రి జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అభినందన సభ ఏర్పాటు చేశారు. రెండేండ్ల కాలంలో డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను బ్రోచర్ రూపంలో విడుదల చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాటాడుతూ.. జిహెచ్ఎంసి ఎన్నికల్లో పటాన్‌చెరు నియోజ కవర్గ పరిధిలోని భారతినగర్, రామచంద్రపురం, పటాన్ చెరు డివిజన్లలో బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గుర్తు చేశారు. ఒకనాడు కాలుష్యానికి చిరునామాగా పేరొందిన పటాన్ చెరు నేడు అభివృద్ధికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల సహాయ సహకారాలతో వందల కోట్ల రూపాయల నిధులు వెచ్చించి పెద్ద ఎత్తున మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. అధికారులు ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే అభివృద్ధి సుసాధ్యం అవుతుందన్నారు. ప్రజలు అందిస్తున్న ప్రోత్సాహంతో రాబోయే మూడేండ్లలో మూడు డివిజన్లను ఆదర్శంగా తీర్చి దిద్దుతామని హామీ ఇచ్చారు. డివిజన్ల అభివృద్ధికి అనునిత్యం అహర్నిశలు కృషి చేస్తున్న కార్పొరేటర్లను ఈ సందర్భంగా అభినందించారు. కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి సహాయ సహకారాలతో పటాన్‌చెరు డివిజన్ ను గెలిచిన రెండేళ్ల కాలంలో 107 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. వచ్చే ఈ మూడేళ్ల కాలంలో ప్రజా అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, అమీన్పూర్ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, ఎంపీపీ దేవానందం, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, దశరథ్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు అఫ్జల్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం





నవతెలంగాణ-పటాన్‌చెరు

నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలతో పాటు పురాతన ఆలయాలను జీర్ణోద్దారణ చేసేందుకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్‌చెరు మండలం కర్దనూర్ గ్రామంలో శ్రీశ్రీశ్రీ అక్క మహంకాళి బీరప్ప స్వామి, కామారతి అమ్మవార్ల విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆలయ నిర్మాణానికి రూ.6 లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ దేవాలయాల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహాయ సహకారాలతో గుడి నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు సేకరించినట్టు సర్పంచ్ ఎర్ర భాగ్యలక్ష్మి సత్యనారాయణ. ఉపసర్పంచ్ వడ్డే కుమార్ తెలిపారు. రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నగేష్, బీఆర్ఎస్ నాయ కులు దశరథ్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి మహా జాగరణ ఏర్పాట్ల పరిశీలన

మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని ఈనెల 18వ తేదీ సాయంత్రం 6 గంటల నుండి పటాన్‌చెరు పట్టణంలోని మైత్రి మైదానంలో మహాశివరాత్రి మహా జాగరణ, స్వర లింగోద్భవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహాశివరాత్రి సందర్భంగా 50 అడుగుల మహా శివలింగం, మహాశివుడి ప్రతిమలను ఏర్పాటు చేసి వేద పండితులచే మహన్యాస రుద్రాభిషేకం, శివపార్వతుల కళ్యాణం, ప్రముఖ సినీ నేపథ్య గాయకులచే సంగీత విభావరి, సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తు న్నామన్నారు. మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ ఎంపిటిసి రామచంద్రారెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మెరాజ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజులు.. 7 గంటల పని కావాలి



- సీఐటీయు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

కార్మికులకు ఐదు రోజులు.. 7గంటల పని కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. ఆదివారం టీఐడిసి కార్మికుల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించగా.. చుక్క రాములు హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు తీవ్రమైన అన్యాయం చేస్తున్నదన్నారు. కార్మికులు చాలా రోజుల నుంచి ఎదురుచూస్తున్న సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ప్రధానమంత్రి మోడీ అనేక సార్లు ఇచ్చిన వాగ్దానాన్ని ఈసారి కూడా బడ్జెట్లో విస్మరించారన్నారు. కార్మికులు ఈ బడ్జెట్లో తమకు రాయితీలు వస్తాయని.. సమస్యలు పరిష్కారం అవుతాయని ఎదురు చూశారన్నారు. ప్రత్యేకంగా కార్మిక లేబర్ కోడ్‌లను రద్దు చేస్తారనుకున్నారన్నారు. అలాగే కార్మికుల సంబంధించిన పిఎఫ్ వడ్డీ శాతం పెంపదలు ఉంటుందని ఆశించారన్నారు. కానీ అవేమీ జరగలేదన్నారు. ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా అమ్మడం కోసం ప్రతిపాదించడం దుర్మార్గమన్నారు. ప్రయివేటీకరణను వేగవంతం చేయడం దేశానికి ద్రోహం తప్ప వేరేది కాదన్నారు. బీజేపీకి కార్పొరెట్లు తప్ప వేరే అవసరం లేదని మరోసారి రుజువైందన్నారు. కనీస వేతనాల ఊసే లేదని అన్నారు. ఈఎస్ఐ, పిఎఫ్, ఇన్సూరెన్స్ లాంటి మీద స్పష్టత ఏమాత్రం రాలేదని, కనీసం అటువైపు ఆలోచన కూడా చేయలేదని అన్నారు. స్కీములకు బడ్జెట్ పెంపుదల లేదని, రవాణా చట్టం, విద్యుత్ చట్టం లాంటివి ఉపసంహరించుకుంటూదేమని కార్మికులోకం ఎదురుచూస్తే వాటి గురించి చూసే లేదన్నారు. రవాణ కార్మికుల కు వెల్ఫేర్ బో ర్డు వస్తదని ఎదురు చూస్తే అది కూడా పరిష్కారం కాలేదని అన్నారు. సంక్షేమం గురించి ఊసే లేదన్నారు, బడ్జెట్ పై ఆందోళన చేస్తామన్నారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి మల్లేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు రాజయ్య, యూనియన్ జనరల్ సెక్రెటరీ భాస్కర్ రెడ్డి, నాయకులూ శ్రీనివాస్, శేఖర్, నాగేశ్వర రావు,ప్రభాకర్, వేణు గోపాల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్ప లబ్ధిదారులను ఆదుకోవాలి

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.జయరాజ్



నవతెలంగాణ-సంగారెడ్డి

రాజీవ్ గృహకల్ప లబ్దిదారులని ఆదుకోవాలని.. వారికి డబుల్ బెడ్ రూం ఇండ్లు అందజేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి జి.జయరాజ్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక రాజీవ్ గృహకల్ప లబ్దిదారుల సమావేశాన్ని పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009లో రాజీవ్ గృహకల్ప ఇండ్ల కోసం 216 మంది లబ్దిదారులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అప్పులు చేసి బంగారం తాకట్టు పెట్టి రూ.49,000ను రాష్ట్ర ప్రభుత్వానికి చెల్లించాలరన్నారు. ఏండ్లు గడిచినా లబ్దిదారులకు మాత్రం రాజీవ్ గృహకల్ప ఇల్లు మంజూరు చేయలేదన్నారు. పెరుగుతున్న ధరలకు ఇంటి అద్దెలు, పిల్లల స్కూలు ఫీజులు కట్టలేక లబ్దిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో నిజమైన లబ్దిదారులకు న్యాయం జరగడం లేదని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి రాజీవ్ గృహకల్ప లబ్దిదారులకు ఇండ్లు మంజూరు చేసి వారి కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. పార్టీ నాయకులు యాదవ్ రెడ్డి, యాదగిరి, షబ్బీర్, బాలరాజు, మల్లేశం, రాము, పంతులు, తదితరులు పాల్గొన్నారు.

'తల గాయం'పై అవగాహనా సదస్సు



నవతెలంగాణ-సంగారెడ్డి

మార్చి 20న ప్రపంచ తల గాయం అవేర్‌నెస్ డేను పురస్కరించుకుని శనివారం రాత్రి జెడ్పీ హాలులో రోడ్డు భద్రతా మరియు తల గాయాలపై శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించినట్టు హెూప్ న్యూరో మరియు మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఆర్ఎస్ అధికారి డా.సుధాకర్ నాయక్, డీఎస్పీ రవీందర్ రెడ్డి, న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర యువజన సంఘాల అధ్యక్షుడు కూన వేణు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణకుమార్ పాల్గొని హెల్మెట్ రైడ్ లోగోను విడుదల చేశారు. తలకు గాయం, రహదారి భద్రతపై షార్ట్ ఫిల్మ్ ప్రేక్షకు లకు ప్రదర్శించారు. జిల్లావ్యాప్తంగా ఉన్న విద్యార్థులకు షార్ట్‌ఫిల్మ్‌ను ప్రదర్శిస్తుందని, జిల్లాలో 5 హెల్మెట్ రైడ్ ఈవెంట్‌లను హాస్పిటల్ ప్రదర్శిస్తుందన్నారు. హెల్మెట్ రైడ్‌లో 100 హెల్మెట్‌లు ఉచితంగా ఇవ్వనున్నట్టు తెలిపారు. శంకర్ మతం సీఈఓ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

శ్రీకాకుళానికి చెందిన చందు 25 ఏండ్ల క్రితం బొల్లారం మున్సిపల్ పరిధిలోని వినాయకనగర్ కాలనీకి వలస వచ్చి.. ఇక్కడే ఉంటున్నాడు. అయితే అతని కుమా రుడు చిన్ననాటినుంచే కిడ్నీ వ్యాధితో బాధపడు తున్నాడు. నడుస్తూనే ఆకస్మాత్తుగా పడిపోతుంటాడు. ఇప్పటికే అతని పలు మార్లు ఆసుపత్రుల చుట్టూ తిప్పిన తల్లిదండ్రులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. కాగా ఆ కాలనీవాసులు ఒకసారి ఆనంద్ కృష్ణారెడ్డికి ఫోన్ చేయండి.. సాయం చేస్తాడు అని చెప్పడంతో ఆ తండ్రి ఆనంద్ కృష్ణారెడ్డికి ఫోన్ చేశాడు. దీంతో ఆయన వెంటనే స్పందించి.. తనవంతుగా రూ.20,000 సాయాన్ని అందిస్తా నన్నా రు. అధైర్య పడొద్దని.. తాను అండగా ఉంటానని ధైర్యం చెప్పాడు. బాధిత కుటుంబ సభ్యులు ఆనంద్ కృష్ణారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

వివిధ శుభాకార్యాల్లో పాల్గొన్న నరోత్తం



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ నియోజకవర్గంలో జరిగిన వివిధ శుభకార్యాల్లో టీపీసీసీ నాయకులు వై.నరోత్తం పాల్గొన్నారు. జహీరాబాద్ పట్టణంలోని ఎస్‌వీ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన మొగుడంపల్లి గ్రామానికి చెందిన ఎస్.వెంకట్‌రెడ్డి కుమార్తె వివాహానికి, పట్టణంలోని శేట్కార్ ఫంక్షన్ హాల్ లో జరిగిన ఝరాసంఘం మండల పోట్‌పల్లి గ్రామానికి చెందిన యం.మల్లిఖార్జున్(యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి) సహోదరి వివాహానికి, న్యాల్‌కల్ మండలం టేకూర్ గ్రామానికి చెందిన ఎల్లయ్య గౌడ్ కుమార్తె వివాహానికి, జహీరాబాద్ పట్టణంలోని బసవేశ్వర ఫంక్షన్ హాల్‌లో జరిగిన పట్లోళ వీరప్ప మనవరాలి నూతన వస్త్రాలంకారణ మహోత్సవ కార్యక్రమాల్లో వై.నరోత్తం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యం.మోహన్ రెడ్డి, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు పి.నాగిశెట్టి,మండల కోఆప్షన్ సభ్యులు మైనోద్దీన్,మాజీ సర్పంచ్‌లు నబి సాబ్, సంతోష్, నర్సింలు, అంజద్, వినాయక్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చెంగల్ జైపాల్, మాణిక్, పాండు తదితరులు పాల్గొన్నారు.

హమారా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలి



నవతెలంగాణ-నారాయణఖేడ్

సోషల్ మీడియా వేదికగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ పై దేశ ద్రోహి, పీడీ యాక్ట్ కేసు పెట్టి కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం(కేవీపీఎస్) రాష్ట్ర కమిటి సభ్యులు కోటారి నర్సింలు, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు హల్లే జీవన్, బీం ఆర్మీ నియోజకవర్గ అధ్యక్షులు బి.సురేష్, లక్ష్మణ్, బీఎస్పీ మనూర్ మండల అధ్యక్షులు తుకారం, అంబేద్కర్ సేన అధ్యక్షులు టి,రాజ్ కుమార్, అంబేద్కర్ ఫౌండేషన్ నిర్వహికులు జి.సంజీవులు డిమాండ్ చేశారు. ఈ దుర్మార్గమైన కులదురహంకార దారుణమైన వ్యాఖ్యలు మరొకరు మాట్లాడకుండా కఠినంగా శిక్షించాలన్నారు. బీజేపీకి చెందిన హమారా ప్రసాద్.. నిరంతరం తాను చేస్తున్న చిల్లర పనులకు తోడుగా.. వ్యక్తిగత పాపులారిటీని పెంచుకోవడం కోసం రాజ్యాంగ నిర్మాత పైనే అనుచిత వ్యాఖ్యలు చేయడం దేశ ప్రతిష్టకే అవ మానకర మన్నారు. జాతీయ నాయకులను కించపరిచే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో కేవీపీఎస్, బీమ్ ఆర్మీ, బీఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం



నవతెలంగాణ-నర్సాపూర్ + నర్సాపూర్ పట్టణంలోని వృద్ధాశ్రమంలో ఆదివారం బండారి గంగాధర్, యువసేన నాయకులు పెద్దపులి సతీష్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సేవా రత్న అవార్డు గ్రహీత, శివంపేట బీఆర్ఎస్ పార్టీ మండల కోశాధికారి బండారి గంగాధర్ ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన కార్యక్రమన్ని ప్రారంభించారు. అనంతరం వృద్ధులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా బండారి గంగాధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి జన్మదిన వేడుకలను హంగు అర్భాటాల మధ్య జరుపుకొని డబ్బులను వృధా చేసుకునే బదులు వారి జన్మదినం సందర్భంగా వృద్ధులకు అన్నదానం చేస్తే ఎంతో పుణ్యం దొరుకుతుందని అన్నారు.పెద్దపులి సతీష్‌ను బండారి గంగాధర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి సర్పంచ్ కృష్ణ. బండారి గంగాధర్ యువసేన నాయకులు ఆనంద్ కుమార్, కృష్ణ గౌడ్, బండారి నాగేష్, బేస్త శ్రీనివాస్, గొల్ల శ్రీశైలం ,వీరేష్, తదితరులు పాల్గొన్నారు తదితరులు ఉన్నారు.



చికెన్ ధరలు (కే.జీ)

ఫాంరేటు	- రూ. 96
రిటైల్	- రూ. 118
విత్‌స్కిన్	- రూ. 171
స్కిన్‌లెస్	- రూ. 195

వధూవరులను ఆశీర్వదించిన మాజీ డిప్యూటీ సీఎం



నవ తెలంగాణ-రేగోడు

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి కుమారుడు సచిన్ రెడ్డి గీతాంజలి వివాహ వేడుకలకు ఆదివారం మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ హాజరై వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి యాదగిరి, పిసిసి సభ్యులు మున్నూరు కిషన్, కోఆప్షన్ సభ్యులు చోటు బాయ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, జగిర్యాల సర్పంచ్ నర్సింలు, కొండాపురం మాజీ సర్పంచ్ సంగమేశ్వర పటేల్, తదితరులు పాల్గొన్నారు.

పేదింటి వధువు వివాహానికి పుస్తెమట్టెలు అందజేసిన బండారి గంగాధర్



నవతెలంగాణ-నర్సాపూర్

మండల కేంద్రమైన శివంపేట గ్రామానికి చెందిన సోమసాని నర్సింలు లక్ష్మీ దంపతుల కూతురు సరస్వతి వివాహానికి ఆదివారం పిల్లుట్ల గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు సేవా రత్న అవార్డు గ్రహీత బీఆర్ఎస్ పార్టీ మండల కోశాధికారి బండారి గంగాధర్ తన వంతు సాయంగా పుస్తె మెట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లుట్ల మాజీ వార్డు సభ్యులు బండారి నాగేష్, బేస్త శ్రీనివాస్, బేస్త నాగేష్, గొల్ల శ్రీశైలం, సంతోష్, బాలీష్, వీరేష్, పాల్గొన్నారు.

జెడ్పీటీసీని పరామర్శించిన ఎమ్మెల్సీ

నవతెలంగాణ -నిజాంపేట



నిజాంపేటమండల జడ్పిటిసి పంజా విజయ్ కుమార్ గత రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ యశోద హాస్పిటల్లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి ఆదివారం సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌కు వెళ్లి జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్‌ను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. అతని యోగక్షేమాలు తెలుసుకొని జెడ్పీటీసీ త్వరగా కోలుకోవాలని భగవంతున్ని ప్రార్థించారు.

పుస్తె మట్టెలు అందజేత

నవతెలంగాణ-చేగుంట



చేగుంట మండలం అనంత సాగర్ గ్రామానికి చెందిన బెదర బోయిన అనురాధ స్వామి కూతురు అనూష పెళ్లికి పుస్తె మట్టెలు, రెడ్డిపల్లి పీఏసీఎస్ చైర్మెన్ మ్యాకల పరమేష్ ఆదివారం వారి కుటుంబ సభ్యులకు నేరుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎంఎంసీ చైర్మెన్ కృష్ణ, దుబ్బాక పీఏసీఎస్ చైర్మెన్ చెర్ల కైలాష్, బోనగిరి నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు జెడ్పీటీసీ ఆర్థిక సాయం



నవ తెలంగాణ నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో ఇద్దరు బాధిత కుటుంబాలకు జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా ఆదివారం ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామానికి చెందిన వెంచర్ల రాములు కుటుంబాన్ని జెడ్పీటీసీ మహేష్ గుప్తా పరామర్శించి తన వంతు సాయంగా ఐదువేల నగదు నెలకు సరిపడు నిత్యాసర సరుకులను అందజేశారు. అదే గ్రామానికి చెందిన ఎల్లప్పగారి లింగం అనారోగ్యంతో మృతి చెందడంతో మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా రూ.5 వేల నగదు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట అనూష అశోక్ గౌడ్, ఉప సర్పంచ్ సంధ్య వెంకటస్వామి, మాజీ సర్పంచ్ అంజా గౌడ్, గ్రామస్తులు లక్ష్మణ్ యాదవ్, కొడకంచి అంజా గౌడ్, ఒగ్గు శీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ చైర్మన్‌ను కలిసిన పీఏసీఎస్ చైర్మన్



నవతెలంగాణ-చేగుంట

ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, ముదిరాజుల ముద్దుబిడ్డ, ఎమ్మెల్సీ బండ ప్రకాష్ శాసన సభ డిప్యూటీ చైర్మెన్‌గా ఎన్నికైన సందర్భంగా హైదరాబాద్ శాసనమండలిలో ఆదివారం చేగుంట మండలం రెడ్డిపల్లి పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ మేకల పరమేష్ ఎమ్మెల్సి బండ ప్రకాష్‌ను కలిసి పుష్పగుచ్చం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ముదిరాజుల ముద్దుబిడ్డ శాసనసభ డిప్యూటి చైర్మెన్‌గా ఎన్నికైనందుకు చాలా సంతోషంగా ఉందని తెలిపారు.


అనుమానస్పదంగా వ్యక్తి మృతి

నవతెలంగాణ-నర్సాపూర్

చేపల వేటకు వెళ్లిన ఓ వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన ఆదివారం నర్సాపూర్ మండల పరిధిలోని లింగాపూర్ గ్రామ జగ్గయ్య తండాలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన ఎస్సై శివకుమార్ తండావాసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జగ్యా తండాకు చెందిన నునావత్ హట్యా (56) ఆదివారం తెల్లవారుజామున 4 గంటల ప్రాంతంలో తండా సమీపంలోని అయ్యా రోని కుంటాలో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టేందుకు వెళ్లిన హట్యా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికారు. అయితే అదే తండాకు చెందిన మృతుడు హట్యా.కు వరుసకు తమ్ముడైన రవి పంట పొలంలోని బోరు వద్ద అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ విషయమై తాండావాసులు తమకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం సహాయంతో వివరాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు.

కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలి

- మురికి కాల్వ పక్కనే కూరగాయల అమ్మకాలు
- కూరగాయలపై క్రిమి కీటకాలు, బ్యాక్టీరియా



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూరగాయల మార్కెట్లను, మాంసం మార్కెట్లను నిర్మించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. మండల కేంద్రాలలో, నియోజకవర్గ కేంద్రాలలో కూరగాయల మార్కెట్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినా అధికారులు అవేమీ పట్టించుకోవడం లేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. నిజాంపేట మండల కేంద్రంలో కూరగాయలను అమ్ముకోవడానికి సరైన స్థలం లేదు. మార్కెట్ లేక మురికి కాల్వల పక్కనే కూరగాయలను అమ్ముతున్నారు. మురికి కాల్వల పక్కనే కూరగాయలు పెడితే వాటిపై క్రిమి కీటకాలు వాలే ప్రమాదం ఉందని వినియోగదారులు వాపోతున్నారు. ఓ పక్క మురికి కాల్వలు, మరోపక్క రోడ్డుపై వెళ్లే వాహనాలతో వచ్చే దుమ్ము కూరగాయలపై పేరుకుపోతున్నాయని వినియోగదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కూరగాయల మార్కెట్ నిర్మించాలి



నిజాంపేట మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ లేక వినియోగదారులు, అమ్మకందారులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారు. కూరగాయల మార్కెట్ నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించినా అధికారులు పట్టించుకోపోవడం విడ్డూరంగా ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి.

\- జి.బాగాగౌడ్

మార్కెట్ లేక ఇబ్బందులు



మండల కేంద్రంలో కూరగాయల మార్కెట్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. మురికి కాల్వల పక్కనే అమ్ముతున్నందున బ్యాక్టీరియా, క్రిమి కీటకాలు కూరగాయలపై వాలితే ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని మనవి.

\- కొండేరు ప్రభాకర్

ముప్పై ఏళ్ల తర్వాత అపూర్వ సమ్మేళనం



నవతెలంగాణ-మెదక్ రూరల్

మెదక్ వెస్లీ స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. మెదక్ పట్టణంలోని వెస్లీ స్కూల్ కు చెందిన 1991-92 పదో తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. చదువు నేర్పిన గురువులను శాలువా, పూల మాలలతో సన్మానించారు. ఈ సందర్భం గా ఉపాధ్యాయులు మాట్లాడుతు తాము విద్యా నేర్పిన విద్యార్థులు ఉన్నత స్థాయిలో నిలిచి 30 ఏళ్ల తరవాత తమ ముందు నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఎంతో మందికి విద్యా నేర్పిన వారు ప్రయోజకులైతెనే తమకు సొంత పిల్లలు గొప్ప వాళ్ళు అయినంత సంతోషంగా ఉందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ వెస్లీ పాఠశాల లో చదవడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఎంతో చరిత్ర చరిత్ర కలిగిన స్కూల్ లో చదవడం గర్వంగా ఉందన్నారు. నాటి ఉపాధ్యాయులు స్వర్ణలత, శశికళ, శ్యమిదాస్ తో పాటు పూర్వ విద్యార్థులు నాగరాజు, రమేష్, రాజు, గోపాల్ గౌడ్, చెవిటిఅశోక్, దేవేందర్ రెడ్డి, కృష్ణ, మధు, రాంచందర్ సింగ్, మురళి గౌడ్, బాలకృష్ణ, రహ మత్, శ్రీనివాస్, మీనాక్షి, శ్రీదేవి, మంజు వాణి, సరిత, వినయ, సుశీల, విజయ లక్ష్మి పాల్గొన్నారు.

సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రజలు సహకరించాలి

ఎస్సై శివకుమార్



నవతెలంగాణ-నర్సాపూర్ : సైబర్ నేరాలను అరికట్టేందుకు ప్రజలు తమకు సహకరించాలని నర్సాపూర్ నూతన ఎస్ఐ శివకుమార్ అన్నారు. ఆదివారం నర్సాపూర్ పట్టణంలోని పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు వివరాలు, ఇతర వివరాలు అడిగితే సమాచారం ఇవ్వవద్దని సూచించారు. సైబర్ సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 1930తోపాటు 100కు డయల్ చేయాలన్నారు నర్సాపూర్‌లో దొంగతనాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు దొంగతనాల నివారణ కోసం అవసరమైన చోట సీసీ కెమెరాల ఏర్పాటుతోపాటు రాత్రి వేళలో పెట్రోలింగ్ మరింత పెం చడం జరుగుతుందని అన్నారు. రోడ్డు ప్రమాదాల విషయంలో వాహనదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వాహనాలు నడిపే ముందు వాహన దారులు తమ వెనకాల తమ కుటుంబం ఉందని గుర్తుంచు కొని వాహనాలను జాగ్రత్తగా నడపాలన్నారు .శాంతి భద్రతల విషయంలో ప్రజలు తమకు సహకరించాలని సూచించారు.

చిన్నారిని ఆశీర్వదించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలం కర్నాల్‌పల్లి ఎల్లమ్మ టెంపుల్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నం ఆంజనేయులు కుమారుడు అన్నం శ్రీకర్ పుట్టు పంచల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి హాజరయ్యారు. అనంతరం అన్నం శ్రీకర్‌ను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాశ బోయిన శ్రీనివాస్, నర్సింలు స్టాలిన్ , గణేష్, కొండి శ్రీనివాస్, గొడుగుపల్లి మాజీ ఎంపీటీసీ మద్దెల స్వామి, అప్పల సురేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కీడల్లో గెలుపు ఓటములు సహజమే

- గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలు ఏర్పాటు చేయడం అభినందనీయం
- శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా
- సేవా రత్న అవార్డు గ్రహీత బండారి గంగాధర్



నవతెలంగాణ-నర్సాపూర్

క్రీడల్లో గెలుపు ఓటములు సహజమేనని క్రీడాకారులు గెలుపుఓటములను సమానంగా స్వీకరించాలని శివంపేట జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా, సేవా రత్న అవార్డు గ్రహీత బండారి గంగాధర్ అన్నారు .ఆదివారం శివంపేట మండల పరిధిలోని లింగోజిగూడ గ్రామంలో సర్పంచ్ రవి నాయక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తాలూకా స్థాయి వాలీబాల్ పోటీలకు వారు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా, సేవరత్న అవార్డు గ్రహీత బండారి గంగాధర్‌లు, గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇటువంటి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు. క్రీడలు ఆడడం ద్వారా శరీర దృఢత్వం మానసిక ఉల్లాసంతోపాటు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. గ్రామీణ ప్రాంతమైన లింగోజిగూడ లో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నందుకు నిర్వాకులు సర్పంచ్ రవి నాయక్‌ను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు చింత స్వామి, దాసరి వీరేష్, బాలిష్, వివిధ గ్రామాల క్రీడాకారులు పాల్గొన్నారు.

డీసీఎం బైక్ ఢీ, ఒకరు మృతి, మరొకరికి గాయాలు



నవతెలంగాణ- చేగుంట : తండ్రి కూతురు బైక్‌పై వెళుతున్న క్రమంలో బైకు, డీసీఎం ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం చేగుంటకు చెందిన వీరముష్టి గంగాధర్ (48) ఆదివారం కూతురు రవళితో కలిసి బైక్‌పై వెళుతుండగా, రెడ్డిపల్లి బైపాస్ 44వ జాతీయ రహదారిపై డీసీఎం ను ఢీకొనగా ప్రమాదంలో గంగాధర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కూతురు రవళికి తీవ్ర గాయాలు కాగా 108 ద్వారా చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శివాజీ పాలన నేటి పాలకులకు ఆదర్శం

- చత్రపతి శివాజీ విగ్రహావిష్కరణలో వక్తలు



నవతెలంగాణ-రాయపోల్

మరాఠవాడ రాజ్యస్థాపనలో మొగల్ చక్రవర్తులతో పోరాటం చేసి స్వతహా పాలన ఏర్పాటు చేసిన చత్రపతి శివాజీ పరిపాలన నేటి పాలకులు ఎంతో ఆదర్శమని సర్పంచ్ కరుణాకర్ అన్నారు. రాయపోల్ మండలంలోని పెద్ద ఆరేపల్లి గ్రామంలో ఆరెకుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆదివారం గ్రామ సర్పంచ్ కరుణాకర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ కల్లూరి అనిత శ్రీనివాస్, జెడ్పీటీసీ లింగాయపల్లి యాదగిరి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మామిడి మోహన్ రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం నాయకులు రాజిరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చత్రపతి శివాజీ విగ్రహం గ్రామంలో ఏర్పాటు చేయడం సంతోషకరంగా ఉందన్నారు. పరిపాలన, యుద్ధ నైపుణ్యంలో అన్నింటా శివాజీ ఆదర్శప్రాయమన్నారు. మతసామరస్యాన్ని చాటారని పలువురు కొనియాడారు. చత్రపతి శివాజీ మహారాజును యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరె క్షత్రియ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు భూపతిరావు, మండల అధ్యక్షులు రజనీకాంత్, ఏఎంసీ డైరెక్టర్ మల్లేశం, బీజేపీ మండల అధ్యక్షులు మాదాసు వెంకట్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గణేష్, నందు, ఆరే క్షత్రియ కుల సంఘం అధ్యక్షులు రాజయ్య, ఆరె క్షత్రియ సంఘం అధ్యక్షులు రవి, ఉపాధ్యక్షులు రాజు, కుల సంఘం నాయకులు కృష్ణ, స్వామి, శ్రీకాంత్, శివాజీ, మల్లేశం, వెంకట్, కిరణ్ కుమార్, పద్మారావు, వెంకట్రావు, మాజీ ఎంపీటీసీలు మల్ల గౌడ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్‌లో నేడు మెగావైద్య శిబిరం

నవతెలంగాణ-టేక్మాల్ : టేక్మాల్ గ్రామపంచాయతీ ఆవరణంలో సోమవారం మల్లారెడ్డి నారాయణా హృదయాలయ ఆసుపత్రి యాజమాన్యంతో డాక్టర్ల సహకారంతో వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. నిరంతరం గ్రామ పంచాయతీ ప్రజల ఆరోగ్యం కోసం సోమవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 నిమిషాల వరకు స్థానిక గాంధీ భవన్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ నాయికోటి సుప్రజ భాస్కర్. క్యాంప్ ఆర్గనైజర్ వెంకట్‌లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో జనరల్ మెడిసిన్ డాక్టర్ అఖిల, ఆర్థోపెడిక్, డాక్టర్ సింధూర, గైనకాలజీ, హర్షిత. జనరల్ సర్జరీ, పీడియాట్రిక్, ఛాతీ వ్యాధుల, కంటి డాక్టర్లు పాల్గొంటారు. ఈ శిబిరంలో ఉచితంగా బీపీ, షుగర్, పరీక్షలు చేసి ఉచితంగానే డాక్టర్ సంప్రదింపులు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని మండలంలోని అన్ని గ్రామా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాడవాడలా... గడపగడపకు ఋతుప్రేమ చైతన్య రథం



- మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజనర్సు

నవతెలంగాణ-సిద్దిపేట

వాడవాడలా... గడపగడపకు ఋతుప్రేమ చైతన్య రథం తిరుగుతూ ప్రజలను చైతన్యం చేస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ కడవేర్గు మంజుల రాజానర్సు అన్నారు. ఆదివారం పట్టణంలోని 24వ వార్డులో ఋతుప్రేమ చైతన్య రథం వద్ద మహిళలకు అవగాహన కల్పించి మెన్స్ట్రువల్ కప్పులు, క్లాత్ ప్యాడ్‌లు వాడాలని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల నెలసరి ఆరోగ్య సమస్యలపై రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు దేశంలో ఎక్కడా లేనటువంటు వంటి విధంగా సిద్ది పేటలో ఋతుప్రేమ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందన్నారు. పట్టణంలో ప్రతిరోజు ఉదయం చెత్త బండితో పాటుగా ప్రచార రథంను తిప్పడం జరుగుతుందన్నారు. మహిళలకు అవగాహన కోసం ఈ రథాన్ని మంత్రి హరీశ్ రావు ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. ప్రతి రోజు ఒక వార్డు చొప్పున ఈ రథం గల్లీగల్లికి వస్తుందన్నారు. సాలిటర్ ప్యాడ్స్ వినియోగ రహిత సిద్దిపేట దిశగా మనమందరం అడుగులు వేయాలని కోరారు. మహిళల ఆరోగ్యం గురించి ఆలోచించి ఇటువంటి గొప్ప కార్యక్రమాన్ని చేపడుతున్న మంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సానిటరీ ప్యాడ్స్ వాడడం వల్ల అనేక రకాలైన ఆరోగ్య సమస్యలు, పర్యావరణం పాడవడం, ఆర్థికంగా డబ్బులు వృధా అవ్వడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా రసాయనాలు వ్యర్థలతో రూపొందించిన ఈ పాడ్స్ 800 సంవత్సరాలైన భూమిలో కరగవని, అందుకోసమే ప్రత్యామ్నాయ మార్గంగా మెన్స్ట్రువల్ కప్పులను, క్లాత్ ప్యాడ్లను వాడాలని కోరారు. దీనివల్ల ఆరోగ్యం, పర్యావరణం పరిరక్షించడంతో పాటు డబ్బులు కూడ ఆదా అవుతాయని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి సరోజ, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, వార్డ్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

టగ్ ఆఫ్ వార్ నూతన కార్యవర్గ ఎన్నిక



నవతెలంగాణ-సిద్దిపేట

ఉమ్మడి మెదక్ జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ జనరల్ బాడీ సమావేశం సిద్దిపేట పట్టణంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌లో నిర్వహించారు. సిద్దిపేట, మెదక్ జిల్లాల టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాలను ఎన్నుకోవడం జరిగిందని టాగ్ ఆఫ్ వార్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఢిల్లీ వారు నియమించిన ఎలక్షన్స్ రిటర్నింగ్ ఆఫీసర్ అయూబ్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ కన్వీనర్ బ్రహ్మానందం మాట్లాడుతూ ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి టగ్ ఆఫ్ వార్ క్రీడలో విశేష ఆదరణ ఉన్నదని, ఎంతోమంది నైపుణ్యమున్న క్రీడాకారులు ఇక్కడ ఉన్నారని, జాతీయ స్థాయిలో కూడా రాణిస్తున్నారన్నారు. జిల్లా టగ్ ఆఫ్ వార్ అసోసియేషన్ కార్యవర్గంలో అధ్యక్షులుగా గన్నే శ్రావణ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బాణపురం సుమన, వైస్ ప్రెసిడెంట్‌గా ధారవత్ రమేష్, జాయింట్ సెక్రటరీగా గన్నే కుమార్, కోశాధికారిగా తిగుల్ల రాజు, అసోసియేషన్ మెంబర్స్‌గా సురేష్, భరత్, అజయ్ కుమార్, నరేష్ ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారని తెలిపారు. మాజీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ గన్నే రాజీ రెడ్డి, అసోసియేషన్ నెంబర్ భాను ప్రకాష్, వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం సిద్దిపేట జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు తోట సతీష్, కోశాధికారి రాము, సిద్దిపేట స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, జూడో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గన్నే భరత్ రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌సీ సెల్ మండల అధ్యక్షున్ని పరామర్శించిన చెరుకు శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-తొగుట

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లింగాల కృష్ణ ను చెరుకు శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. ఆదివారం తుక్కాపూర్ గ్రామానికి చెందిన లింగాల కృష్ణా రెండు రోజుల క్రితం తీవ్ర అస్వస్థతకు గురై సిద్దిపేటలోని ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పరామర్శించారు. ఆరోగ్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట జిల్లా నాయకులు గాంధారి నరేందర్ రెడ్డి, కొంగరి నర్సింలు, ఫిషర్‌మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ నాయకుడిని పరామర్శించిన ఎంపీ

నవతెలంగాణ-జహీరాబాద్

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, న్యాల్కల్ మండల జెడ్పీటీసీ స్వప్న భర్త భాస్కర్‌ను ఎంపీ బీ.బీ పాటిల్ ఆదివారం పరామర్శించారు. కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురైన భాస్కర్‌ను జహీరాబాద్ పట్టణంలోని ఆయన గృహానికి వెళ్లి ఎంపీ బీబీ పాటిల్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు తెల్సుకున్నారు. ఆపద సమయంలో తమ ముఖ్యమంత్రి, తాము కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. గోవర్ధన్‌రెడ్డి, నవీన్, జయరాజ్, అబ్దుల్లా, జహంగీర్, మోతిరామ్ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-నారాయణఖేడ్

కరస్గుత్తి సర్పంచ్ సంజీవరెడ్డి హైదరాబాదులోని కాటేదాన్ గల ఆయన నివాసంలో ఆదివారం నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతంలో నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్‌రెడ్డి, అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు పాల్గొన్నారు. శ్రీసత్యనారాయణ స్వామి యొక్క ప్రసాదం స్వీకరించారు. హైదరా బాద్‌కు చెందిన శివ, హంసరూడా, ప్రభువు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

నవతెలంగాణ-నారాయణఖేడ్

నియోజకవర్గానికి చెందిన ఉరిటి బాలకృష్ణ ముదిరాజ్ కుమారుడి వివాహ వేడుకలో టీపీసీసీ ఉపాధ్యక్షులు డా.పట్లోల సంజీవరెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బోజిరెడ్డి, మాజీ సర్పంచ్లు, దేవా రెడ్డి, ఈశ్వరప్ప, కిషన్ నాయక్, రాధాకిషన్, శంకర్, పుడ్లిక్ జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జింకను కాపాడిన యువకుడు



నవతెలంగాణ-జోగిపేట

అందోల్ మండల పరిధిలోని దానంపల్లి గ్రామ శివారులో గాయాలతో ఉన్న ఓ జింక అడవిలోంచి బయటికొచ్చింది. దానంపల్లికి చెందిన యువకుడు శ్రీశైలం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్తుండగా.. గాయాలతో ఉన్న ఆ జింకను గమనించాడు. కాలుకు గాయమై పడి ఉండడంతో మానవత్వంతో దానిని తీసుకువచ్చి దాహార్తి తీర్చాడు. ఈ విషయాన్ని వెంటనే రెవిన్యూ అధికారులకు, అటవీశాఖ అధికారులకు సమాచారం చేరవేశారు. కొద్దిసేపటి తర్వాత అధికారులు వచ్చి జింకను తీసుకువెళ్లారు. గాయాలతో ఉన్న జింకను తీసుకువచ్చి కాపాడి అధికారులకు అప్పగించిన యువకుడిని పలువురు అభినందించారు.

ప్లాస్టిక్‌ని నిషేధిద్దాం.. మాతృభూమిని కాపాడుకుందాం

నవతెలంగాణ-సదాశివపేట

ప్లాస్టిక్‌ను నిషేదించి.. మాతృభూమిని కాపాడుకుందామని సదాశివపేట గ్రాడ్యుయేట్స్ అసోషియేషన్ ప్రెసిడెంట్ విశాల్ కుమార్ బాగేలికర్ పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ వాడకం వల్ల మాతృభూమికి తీవ్ర నష్టం వాటిల్లుతోందన్నారు. ప్లాస్టిక్‌ని భూమిలో కరిగిపోవడానికి వందల ఏండ్లు పడుతుందన్నారు. కాబట్టి ప్రతీ ఒక్కరూ ప్లాస్టిక్ వాడకుండా ప్రతిజ్ఞ చేయాలన్నారు.

హనుమాన్ మందిరంలో జ్యోతిర్లింగాల మహా పడిపూజ

నవతెలంగాణ-సదాశివపేట

సదాశివపేట పట్టణంలో ఆదివారం లోపలికోట హనుమాన్ మందిరంలో జ్యోతిర్లింగాల మహా పడిపూజను శివ స్వాములు నాగారం శ్రీనివాస్ దంపతులు మరియు శివ స్వాములు, బసవేశ్వర మందిరం పూజారి బస్వరాజ్ గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తి గీతాలు, భజన పాటలతో ఆర్కెస్ట్రా ద్వారా ఓం నమశ్శివాయ నామస్మరణతో మార్మోగాయి. 100 మంది శివ స్వాములు, 500 మంది భక్తజనులు పాల్గొని భారీగా జ్యోతిర్లింగాల మహా పడిపూజను నిర్వహించారు. తర్వాత తీర్థ ప్రసాదం అన్న ప్రసాదన్న కార్యక్రమం కూడా నిర్వహించారు. పోలా సతీష్ స్వామి, చంద్రశేఖర్ స్వామి, పంచాలింగల హనుమాన్ స్వామి, భక్తులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ రాంచేందర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-నారాయణఖేడ్

మండలంలోని వెంకటాపూర్ మాజీ ఎంపీటీసీ రాంచేందర్ జన్మదిన వేడుకలో టీపీసీసీ ఉపాధ్యక్షులు డా.పట్లోల సంజీవ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కేక్ కటింగ్ చేయించి శాలువాతో సన్మానించారు. ఖేడ్ నియోజకవర్గం నేతలు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బోజిరెడ్డి, గుండెరావు పాటిల్ పోషయ్య లక్ష్మి నారాయణ, సర్పంచ్‌లు, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీకాంత్, ఎస్సీ సెల్ అధ్యక్షులు శ్రీకాంత్, రాజేష్ చౌహన్, కౌన్సిలర్ నారాయణ్ జాదవ్ , శ్రీకాంత్ రెడ్డి, జ్ఞానేశ్వర్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

తాగి నడిపితే జైలుకే..

నవతెలంగాణ-నారాయణఖేడ్

వాహనదారులు తాగి వాహనాలు నడి పితే జైలుకు పోవడం తప్పదని ఎస్సై వెంకట్‌రెడ్డి అన్నారు. మద్యం సేవించి వాహ నాలను నడుపుతూ పట్టుబడిన 73 మందిని శని వారం కోర్టులో హాజరుపర్చగా.. జెఎఫ్‌సియం మేడం రూ.80,000 జరిమాన విధించిందన్నారు. రెండోసారి తాగి నడిపితస్తే జైలుకు పంపిస్తామని హెచ్చరించారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజలు కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. ఆదివారం ఇంటిలో విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృతంలో రెండో విడత కంటి వెలుగు ప్రజలకు చేరువ కావాలని ఈ కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. మున్సిపల్ పరిధిలోని 20 వార్డులలో దశలవారీగా శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

గృహప్రవేశానికి హాజరైన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-మర్కుక్

వర్గల్ మండల పీఏసీఎస్ డైరెక్టర్ దమ్మకపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం నూతన గృహప్రవేశ వేడుకలను నిర్వహించారు. ఈ వేడుకలకు బీఆర్ఎస్ మర్కుక్ మండలాధ్యక్షులు మర్కుక్ కర్ణాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షులు మేకల కనకయ్య ముదిరాజ్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాములపర్తి కర్ణాకర్, పాములపర్తి బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు పిట్ల మహేష్, నాయకులు మహేష్ తదితరులున్నారు.


రేబర్తిలో బీరప్ప కామరాతిలకు జలాభిషేకం

నవతెలంగాణ-మద్దూరు

మండలంలోని రేబర్తి గ్రామంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన బీరప్ప దేవాలయం వద్దకు కురుమ కులస్తులు ప్రతి ఇంటి నుంచి జలకడవలు తీసుకొని డప్పు చప్పులతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం బీరప్ప, కామరాతిల కల్యాణానికి లగ్నపత్రిక రాసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కురుమ కులస్తులు మాట్లాడుతూ 23 ఏళ్ల క్రితం గ్రామంలో బీరప్ప పెద్ద పండుగ నిర్వహించినట్లు తెలిపారు. నూతనంగా బీరప్ప, కామరాతి, అక్క మహంకాళి, బుగ్గి పోచమ్మ, దేవాలయాలను నిర్మించుకున్నట్లు తెలిపారు మార్చి 6న బీరప్ప కామరాతిల కల్యాణాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమానికి గ్రామాలలోని ప్రజలు పెద్ద సంఖ్యలో రావాలని కోరారు ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నాయకులు కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవ తెలంగాణ-రాయపోల్



ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బేగంపేట పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి... మండల పరిధిలోని ఎల్కల్ గ్రామానికి చెందిన తొర్రి యాదగిరి(38) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత ఆరు నెలల క్రితం వారి పెద్ద కూతురు దీక్ష వివాహం చేశారు. ఈ వివాహం కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కనబడకపోవడంతో నిత్యం ఇంట్లో కుటుంబ సభ్యులతో ఈ విషయాన్ని గుర్తు చేసుకుంటూ మనోవేదనకు గురయ్యాడు. శనివారం సాయంత్రం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. చీకటి అయినప్పటికీ ఇంటికి తిరిగి రాకపోవడంతో భార్య లలిత, కుమారుడు కుటుంబ సభ్యులతో కలిసి పొలం వద్దకు వెళ్లి వెతికితే యాదగిరి తుమ్మ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బేగంపేట ఎస్సై అరుణ్ తెలిపారు.

దుబ్బాకలో మూడు ముక్కలాట

- కత్తి కార్తీక రాకతో మారుతున్న రాజకీయాలు
- సొంత మండలంలో పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ సీనియర్ నాయకులు



నవ తెలంగాణ-మిరుదొడ్డి

దుబ్బాక నియోజకవర్గంలో మాజీ మంత్రి చెరుకు ముత్యంరెడ్డి తనయుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి ఎవరికి వారే.. తొగుటలో ఒకరు, దుబ్బాకలో మరొకరు జోడోయాత్రకు మద్దతుగా పాదయాత్రలు నిర్వహిస్తున్నారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు ఎవరి వైపు వెళ్లాలో అయోమయానికి గురవుతున్నారు. ఈ క్రమంలో టీవీ యాంకర్ కత్తి కార్తీక తాను సైతం జూడోయాత్రకు సంఘీభావంగా పాదయాత్ర చేస్తారని ప్రకటించడంతో దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీ మూడుముక్కలాటగా మారింది. కాంగ్రెస్ గత కొన్ని సంవత్సరాలుగా పని చేస్తున్న కార్యకర్తలు ఎటు వెళ్లాలో తోచని పరిస్థితి. కత్తి కార్తీకకు కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ మధు యాష్కిగౌడ్ అండదండలు ఉన్నాయని ప్రచారాలు కొనసాగుతున్నాయి. దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు గ్రూప్ రాజకీయాలు తల పట్టుకుంటున్న క్రమంలో కత్తి కార్తీక దుబ్బాకకు రావడంతో కాంగ్రెస్‌లో చిచ్చు మొదలైంది. స్థానిక కాంగ్రెస్ నాయకులను ఏకతాటిపైకి తీసుకొచ్చే నాయకులు లేరంటూ చర్చించుకుంటున్నారు. కార్యకర్తలు ఎవరి వైపు వెళ్లాలో తెలియని అయోమయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ అధిష్టానం కల్పించుకొని స్థానిక నాయకులను ఏకతాటిపైకి తీసుకొచ్చి జోడోయాత్రకు మద్దతుగా అందరు నాయకులు కలిసి పాదయాత్ర చేస్తే దుబ్బాక నుంచి మంచి ఫలితాలు వస్తాయని అభిప్రాయం వ్యక్తమవుతున్నాయి.

తగ్గేదేలే..

అవసరమైతే కోర్టుమెట్లక్కం

నవతెలంగాణ- గజ్వేల్



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళిని పదవి నుంచి తొలగించేందుకు పార్టీ అధిష్టానం వెంటనే నిర్ణయం తీసుకోవాలని, అలా నిర్ణయం తీసుకోకపోతే పార్టీ బెదిరిస్తే... తాము తగ్గేదే లేదని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు తెలిపారు. మున్సిపల్ చైర్మన్‌పై అవిశ్వాసం కోసం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన వెంటనే క్యాంపు వెళ్లిన 14 మంది కౌన్సిల్ సభ్యులు ఆదివారం వీడియో కాల్ ద్వారా నవ తెలంగాణతో మాట్లాడారు. తాము ఎలాంటి తప్పు చేయలేదని, చేయబోమని పేర్కొన్నారు. తమతోపాటు గజ్వేల్‌లో ఉన్న మిగతా ఐదుగురు సభ్యులు కూడా మున్సిపల్ చైర్మన్‌పై అసంతృప్తితో ఉన్నారన్నారు. పార్టీ అధిష్టానం మున్సిపల్ చైర్మన్ తొలగింపుపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డిలకు తమపై నమ్మకం ఉందని తెలిపారు. తాము పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడం లేదని చెప్పారు. ప్రధాన డిమాండ్‌పై మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక దృష్టి పెట్టి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళిని పక్కకు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం కావడం వల్ల మూడు సంవత్సరాలు ఓపిక పట్టినట్లు చెప్పారు. అధిష్టానం తొందరగా నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ చైర్మన్‌నే కొనసాగిస్తామని అధిష్టానం భావిస్తే కోర్టుకు వెళ్తామని పేర్కొన్నారు. కోర్టు ద్వారా గజ్వేల్ ప్రజలకు న్యాయం చేస్తామని చెప్పారు. కౌన్సిల్ సభ్యులు గంగిశెట్టి చందన, దుంబాల లక్ష్మి, శ్యామల, అర్చన, వరలక్ష్మి, సహిన, బాలమణి, శిరీష, రజిత, విద్యారాణి, బాలేష్, కూరాకుల శ్రీనివాస్, అత్తిలి శ్రీనివాస్, రహీం తదితరులు ఉన్నారు.

బురదలో పడి రైతు మృతి

నవతెలంగాణ-రాయపోల్

పొద్దు తిరుగుడు పంటకు నీరు పారపెడుతూ అకస్మాత్తుగా బురదలో పడిపోయి రైతు మృతి చెందిన సంఘటన రాయపోల్ మండలం తిమ్మక్‌పల్లి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని తిమ్మక్‌పల్లి గ్రామానికి చెందిన పొట్టెళ్ల కనకయ్య(33) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన మరో రైతు 5 ఎకరాల వ్యవసాయ పొలాన్ని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నారు. ఆ పొలంలో పొద్దుతిరుగుడు పంట సాగు చేశారు. శనివారం పంట చేనుకు నీళ్ల పార పెట్టడానికి వెళ్లి రాత్రి 8 గంటలవుతునా ఇంటికి తిరిగి రాలేదు. దీంతో భార్య స్థానికుల సహకారంతో పొలం వద్దకు వెళ్లి చూడగా కనకయ్య బురదలో బోర్లా పడిపోయి ఉన్నాడు. వెళ్లి చూసేసరికి ప్రాణాలు కోల్పోయాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య నవనీత ఫిర్యాదు మేరకు ఎస్సై షేక్ మహబూబ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



బీఆర్ఎస్‌లో ముసలం

- అన్ని అనుబంధ కమిటీల్లో అసంతృప్తులు
- సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడి ఎన్నికతో బట్టబయలైన వర్గ విభేదాలు
- ఒత్తిడిలో బీఆర్ఎస్ అనుబంధ కమిటీల శ్రేణులు
- చర్చనీయాంశంగా మారిన బీఆర్ఎస్ నాయకుడిపై వేటు
- రెండు వర్గాలుగా విడిపోయిన అధికార పార్టీ నాయకులు

నవతెలంగాణ-బెజ్జంకి

బాధ్యతలు చేపట్టిన నాటి నుండి సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు అంటీముట్టనట్టు వ్యవహరిస్తూ సర్పంచుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నాడనే అసంతృప్తితో మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు రహస్యంగా బేటీ అయ్యారు. మరుసటి రోజు సర్పంచ్‌ల ఫోరం నూతన మండలాధ్యక్షుడిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉదయం సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలిని శాలువాతో సన్మానించారు. సాయంత్రం మరో అధ్యక్షుడిని ఎన్నుకుని సర్పంచులు ఎవరికివారే ప్రకటించుకోవడం వంటి పరిణామాలు, బీఆర్ఎస్ పార్టీలో ప్రధాన నాయకులు వ్యవహరిస్తున్న ఒంటెత్తు తీరుకు దర్పణం పడుతున్నాయి.

మండలంలో 23 సర్పంచ్ స్థానాలు

మండలంలో 23 గ్రామ పంచాయతీలున్నాయి. పలువురు సర్పంచులు ఎన్నికైన అనంతరం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మండలంలోని ఆయా గ్రామాల సర్పంచులు బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతుండడంతో నాలుగేళ్లు ఎలాంటి పరిణామాలు చోటుచేసుకోకుండా సాఫీగా పరిపాలన సాగింది. ప్రధాన ప్రజాప్రతినిధి, ప్రధాన నాయకుడు కలిసి వారికి అణుకువగా ఉండే ఒకరిద్దరూ సర్పంచులకు అనుకూలంగా వ్యవహరించడం.. అణుకువగా లేని సర్పంచులను చూసీచూడనట్టు వ్యవహరిస్తూ వివక్ష చూపడం వంటి పరిణామాలు తీవ్ర అసంతృప్తికి గురిచేశాయని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యల పరిష్కారమవ్వడం లేదు. కనీస గౌరవం లభించడంలేదని సర్పంచులు కేవలం నిమిత్తమాత్రులేనని తీవ్ర అసంతృప్తికి లోనవుతూ అసహనం వ్యక్తం చేస్తున్నారు.

నాయకుడి వేటుపై విమర్శలు

సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడి ఎన్నికలో గూడెం గ్రామ సర్పంచ్ భర్త, మాజీ ఎఎంసీ చైర్మన్ పార్టీ వ్యతిరేక కాలపాలకు పాల్పిడ్డాడని క్రమశిక్షణ చర్యల కింద వేటు వేశారు. నాయకుడిపై వేటు వేసిన వ్యవహారంపై మండలంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గత కొన్ని ఏండ్లుగా కొందరు ప్రధాన నాయకులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వ్యవహరిస్తున్న తీరుతో పార్టీ పటిష్టతకు భంగం కలుగుతోందని, వారిపై మొట్టమొదట చిత్తశుద్ధితో అధిష్టానం క్రమశిక్షణ చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీపై ప్రజల్లో నమ్మకం కోల్పోయే పరిస్థితులు ఎదురవుతాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఒత్తిడిలో బీఆర్ఎస్ శ్రేణులు

ఇతర పార్టీల శ్రేణులు బీఆర్ఎస్ పార్టీపై సామాజిక మాధ్యమంలో ఆరోపణలు చేస్తుంటే.. చూస్తూ ఏం చేస్తున్నారని.. ఆరోపణలకు దీటుగా బదులివ్వాలని ఒత్తిడి గురిచేస్తున్నట్టు పలువురు బీఆర్ఎస్ శ్రేణులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రధాన నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం బలికావల్సి వస్తుందని ఆరోపిస్తున్నారు. మండలంలోని బీఆర్ఎస్ అనుబంధ కమిటీల నాయకులకు కనీస గుర్తింపు లేదని వాపోతున్నారు. దీంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నామని చెబుతున్నారు.

అధికార పార్టీలో చర్చనీయాంశం

రాష్ట్ర ముఖ్యమంత్రి, ఆర్థిక వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న సిద్దిపేట జిల్లాలోని బెజ్జంకి మండలంలో ఇద్దరు సర్పంచుల ఫోరం అధ్యక్షుల ఎన్నిక రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. అధికార పార్టీకి చెందిన సర్పంచులు అనుసరించిన ద్వంద్వ వైఖరిని కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీలు వాడుకోవాలని చూస్తున్నాయి. ఈ నేపథ్యంలో మండలంలోని బీఆర్ఎస్‌లో ఏం జరుగుతున్నది? అనే ఆసక్తి నెలకొంది. ఈ వ్యవహారాన్ని స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ చక్కదిద్దుతారా? మంత్రి హరీశ్‌రావు రంగంలోకి దిగుతారా? ఈ వ్యవహారం ఎక్కడి వరకు వెళ్లనున్నదనేది ఆసక్తిగా మారింది.

మండల బీఆర్ఎస్ పార్టీలో తామే ప్రధానమని వ్యవహరిస్తున్న వారి తీరువల్లే ఇలాంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని విమర్శలున్నాయి. మున్ముందు ఏం జరుగుతుందో వేచి చూడాలి మరి..

పటాన్‌చెరులో ప్రతిపక్ష పార్టీల అడ్రస్ గల్లంతే

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- బీఆర్ఎస్‌లో చేరిన 300 మంది కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు



నవతెలంగాణ-అమీన్‌పూర్

ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పటాన్చెరు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో పాటు కుటుంబాలతో సహా బీఆర్ఎస్ చేరుతున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో ప్రతిపక్షాల అడ్రస్ గల్లంతు కానుందని దీమా వ్యక్తం చేశారు. ఆదివారం సాయంత్రం అమీన్పూర్ మున్సిపల్ పరిధిలోని 5వ వార్డు ఆర్టీసీ స్వర్ణపురి కాలనీలో స్థానిక కౌన్సిలర్ మహాదేవరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 300 మంది కార్యకర్తలు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వీరందరికీ పార్టీ కండువాలు కప్పి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాధవపురి హిల్స్ మీదుగా హెచ్ఎంటి కాలనీ, పీజేఆర్ కాలనీల మీదుగా స్వర్ణపురి కాలనీ వరకు భారీ బైక్ ర్యాలీ నిర్వ హించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. పోరాడి సాధించుకున్న తెలంగాణను బంగారు తెలంగాణగా తీర్చిదిద్దిన మహోన్నత నాయకులు ముఖ్యమంత్రి కేసీఆర్ అని అన్నారు. విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలతో పాటు ఐటీ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టి రాష్ట్రాన్ని దేశానికి ఆదర్శంగా నిలిపారన్నారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను వివిధ రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి చేయూతను అందించాల్సిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం కక్షపూరిత వైఖరిని అనుసరిస్తూ, రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తోందన్నారు. నూతనంగా ఏర్పడిన అమీన్పూర్ మున్సిపల్ పరిధిలో వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తూ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకొని వెళుతున్నామని తెలిపారు. స్వర్ణపురి కాలనీలో బిజెపి, కాంగ్రెస్ పార్టీల కార్యకర్తలతో పాటు వారి కుటుంబ సభ్యులు సైతం పార్టీలో చేరడం ఆనందంగా ఉందని అన్నారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామని తెలిపారు. అనంతరం కాలనీలో 1600 గజాలలో 15 లక్షల రూపాయలతో చేపట్టనున్న పార్కు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్, పార్టీ మున్సిపల్ అధ్యక్షులు బాల్‌రెడ్డి, వివిధ వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యాపార రంగంలో జహీరాబాద్ దినాదినాభివృద్ధి చెందుతోంది

నవతెలంగాణ-జహీరాబాద్



వ్యాపార రంగంలో జహీరాబాద్ దినదినాభివృద్ధి చెందుతుందని ఎంపీ బీ.బీ పార్టీలు అన్నారు. ఆదివారం జహీరాబాద్ పట్టణంలో దత్తగిరి కాలనీ జాతీయ రహదారిపై రాయల్ అరేబియన్ రెస్టారెంట్‌ను ఎమ్మెల్యే కే.మాణిక్‌రావు, బీ ఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మహమ్మద్ తన్వీర్‌తో కలసి ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గం రాను రాను వ్యాపార వర్గాలకు హబ్‌గా మారుతుందన్నారు. ఇందు కోసం తమ ప్రభుత్వం కూడా అన్ని వర్గాల వారికి సమాన దృక్పథంతో అన్ని విధాల సహాయ సత్కారాలను చేస్తుందన్నారు. సీడీసీ చైర్మెన్ ఉమాకాంత్ పాటిల్, రైల్వే బోర్డు సభ్యులు షేక్ ఫరీద్ కోహిర్ మాజీ సర్పంచ్ మహమ్మద్ ఖలీమ్ నాయకులు మహమ్మద్ నజీర్, సందీప్, బాల్రెడ్డి మాజీ కౌన్సిలర్లు నామ రవి కిరణ్, మోతీరాం, అబ్దుల్లా, జహంగీర్, రాములు నేత తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములపైనా సంపూర్ణ హక్కులు కల్పించాలి

నవతెలంగాణ-నారాయణఖేడ్



రాష్ట్రవ్యాప్తంగా అసైన్డ్ భూములకు పట్టా భూములతో సమాన హక్కు కల్పించాలని.. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతున్నట్లు తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్రోళ్ల శివయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. లావని పట్టా, సీలింగ్ పట్టా, లాంటి అసైన్మెంట్ ల్యాండ్స్ కలిగిఉన్న వారందరికీ పట్టా భూముల్లాగా సమాన హక్కు కల్పించాలని కోరుతూ తహసీ ల్దార్, ఆర్డీవో, కలెక్టర్లకు, జిల్లా కేంద్రంలో పాటు అసెంబ్లీ కేంద్రాలతో పాటు ఎంపీలకు, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 20 లక్షల ఎకరాలకు పైగా అసైన్డ్ భూములు ఉన్నాయని అదే విధంగా దాదాపు 16 లక్షలు 50 వేల లబ్ధిదారుల కుటుంబాలు ఉన్నాయన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసి కులాల ప్రజలకు రెండు ఎకరాలు మూడెకరాలు చొప్పున అప్పటి ప్రభుత్వం భూమిని పంపిణీ చేసిందన్నారు. ఇచ్చిన భూము లకు భద్రత కల్పిస్తామంటూ 1977లో అసైన్డ్ భూముల పీఓటీ చట్టాన్ని కూడా తెచ్చారన్నారు. దాని ప్రకారం భూములను అమ్మరాదని, కొనరాదు లీజుకు ఇవ్వరాదని, పేరు మార్పిడి చేయరాదని, ఎలాంటి కట్టడాలు నిర్మాణాలు చేపట్టరాదని నిబంధనలు పెట్టారన్నారు. దీంతో ఆ భూములు కలిగి ఉన్న లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 1977 పీఓటీ చట్టాన్ని రద్దుచేసి అసైన్డ్ భూవయలు కలిగిఉన్న లబ్ధిదారులకు పూర్తి హక్కు వారికే కల్పిస్తూ చట్టం తేవాలని ప్రభుత్వానికి విన్నవించామన్నారు.

ఘనంగా సంజీవరెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రపంచ కార్మిక వర్గ ఆశాజ్యోతి, అఖిలభారత ఐఎన్‌టియుసి అధ్యక్షులు, మాజీ మంత్రి డాక్టర్ జి సంజీవరెడ్డి 93వ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. సంగారెడ్డి జిల్లా ఐఎన్‌టియుసి అధ్యక్షులు కొల్కూరి నరసింహారెడ్డి ఆయన్ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాటాడుతూ.. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రభుత్వ ప్రైవేటు పరిశ్రమల అధ్యక్షులుగా బిహెచ్ఇఎల్, బీడీఎల్, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ, ఏషియన్ పెయింట్స్, ఐటిసి అనేక ప్రభుత్వ, ప్రైవేటు రంగ పరిశ్రమల కార్మికుల హక్కుల కోసం, సంఘటిత అసంఘటిత కార్మికుల హక్కుల కోసం అనేక పోరాటాలు చేశారన్నారు. ఉద్యోగ భద్రతలో దేశంలోనే కాకుండా ప్రవ ంచవ్యాప్తంగా కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తున్న ఏకైక వ్యక్తి డాక్టర్ జి సంజీవరెడ్డి అని కొనియాడారు. రాబోయే రోజుల్లో డాక్టర్ జి సంజీవరెడ్డి ఆశయాల కోసం.. ఆయన చూపించిన దారిలో ఐఎన్టీయూసీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపైన సంఘటిత పోరాటాలతో తమ హక్కులను కాపాడుకుంటామన్నారు. ఆ సంఘం నాయకులు భాస్కర్ రెడ్డి, విజయ్ కుమార్ యాదవ్, సూర్యకాంత్, శ్రీరాములు భోజంరాజు, సతీష్, రాజారావు, సాగ్రమాట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేవైఎం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-మద్దూరు



బీజేవైఎం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బొంగోని సురేష్ గౌడ్ జన్మదిన వేడుకలను మద్దూరు మండల కేంద్రంలో బీజేవైఎం మండల అధ్యక్షుడు యామ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కేక్ కటింగ్ కార్యక్రమానికి బొంగుని సురేష్ గౌడ్ హాజరై కేక్ కట్ చేసి ప్రజలకు కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు గొడుగు ప్రశాంత్, పైసా బాలకృష్ణ, బొల్లు కిట్టు, బొల్లు రాజు, చింతల రాజు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంధత్వ నిర్మూలనకే కంటివెలుగు

నవతెలంగాణ-మునిపల్లి



అంధత్వ శాశ్వత నిర్మూలనకే సీఎం కేసీఆర్ కంటి వెలు గు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశి కుమార్, యువత అధ్యక్షు డు ఆనంద్ అన్నారు. రూపాయి ఖర్చు లేకుండా 18 ఏండ్లు నిండిన ప్రతీ ఒక్కరికి ఉచితంగా ఈ కంటివెలుగు శిబిరాల్లో పరీక్షలు చేస్తున్నారన్నారు. అవసరమైన వారికి కళ్లద్దాలు కూడా ఇస్తున్నారన్నారు. డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ.. మండలంలోని అంతారం, పోల్కంపల్లి, పెద్ద చల్మెడ గ్రామా ల్లో వేలల్లో పరీక్షలు నిర్వహిస్తుంచామన్నారు. వందల మందికి కంటి అద్దాలు అందించామన్నారు. ప్రతీ ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పెండ్లి కూతురుకు బీరువా అందజేత

నవతెలంగాణ-నారాయణఖేడ్



నారాయణఖేడ్ సొసైటీ సభ్యులు కీర్తి శేషులు లింగ గౌడ్ కుమార్తె వివాహా నికి విగ్రహం శ్రీనివాస్ గౌడ్ హాజరై.. బీరువా, పాలంగ్ అంద జేశారు. కాగా లబ్ధిదారులు మాట్లా డుతూ.. నారాయణఖేడ్ డివిజన్ కమిటీ కల్లుగీత కార్మిక సం ఘం ఇటువంటి కార్యక్రమాలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మార్కండేయ దేవాలయంలో మెదక్ ఎంపి ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డులో గల మార్కండేయ దేవాలయంలో ఆదివారం జరిగిన 27వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పద్మశాలి సమాజం అధ్యక్షుడు బడుగు రాజు, 10, 11 వార్డుల కౌన్సిలర్లు కూరపాటి బంగారయ్య, నందాల శ్రీజ శ్రీకాంత్‌లు ఎంపీని శాలువా కప్పి సన్మానించారు. ఆ తర్వాత జెడ్పీటీసీ కడ్తాల రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గన్నె భూమిరెడ్డి, కొత్త కిషన్ రెడ్డిలను శాలువాలతో సన్మానించారు. పద్మశాలి సమాజం సభ్యులు పలువురున్నారు.

తెరుచుకున్న స్విమ్మింగ్ పూల్



నవతెలంగాణ-సిద్దిపేట

పట్టణంలోని మినీ స్టేడియంలో ఉన్న స్విమ్మింగ్ పూల్ మళ్లీ వినియోగంలోకి వచ్చిందని నిర్వాహకులు లింగం తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు ఈ స్విమ్మింగ్ పూల్ ను వినియోగించుకోవాలని కోరారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు స్విమ్మింగ్ పూల్ తెరచి ఉంటుందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు కృషితో, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్‌ను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఫార్వర్డ్ బ్లాక్ జాతీయ మహాసభల వాల్ పోస్టర్లు ఆవిష్కరణ



నవతెలంగాణ-చేర్యాల

హైదరాబాద్ లోని సుందర య్య కళా నిలయంలో ఈ నెల 23 నుంచి 26 వరకు జరిగే ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 19 వ జాతీయ మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి అందె బీరయ్య మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆధ్వర్యంలో 1940లో నాగపూర్‌లో జాతీయ మహాసభలు నిర్వహించి 'భారత ప్రజలకే సర్వాధికారాలు' అనే నినాదంతో 'ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ 'ను రాజకీయ పార్టీగా ప్రకటించారని అన్నారు. ఈ జాతీయ మహాసభలు తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పుల్లని వేణు, ఒగ్గు తిరుపతి,ఆత్మకూరి హరికృష్ణ,నంగి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

అష్టకాల నరసింహారావుశర్మ మరణం తీరని లోటు



నవతెలంగాణ-సిద్దిపేట

ప్రముఖ అష్టావధాని, అనంతసాగర్ సరస్వతి క్షేత్ర నిర్మాత అష్టకాల నరసింహారామశర్మ మృతి సాహితీ లోకానికి తీరని లోటని జాతీయ సాహిత్య పరిషత్ కవులు అన్నారు. ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు సాహిత్యంలో అవధాన ప్రక్రియలో అష్టావధానిగా వేనోళ్ళ కీర్తి గడించి, ఎందరో శిష్యులను ప్రత్యక్షంగా, పరోక్షంగా ఏర్పాటు చేసుకున్న నరసింహారామశర్మ మరణం తెలుగు సాహితీలోకాన్ని ఎంతగానో కలచి వేసిందని కవులు అన్నారు. దేశం మొత్తం సరస్వతీ యజ్ఞాలు నిర్వహించిన అష్టకాల నరసింహారామశర్మ, సరస్వతి ఉపాసకులుగా పేరుగాంచారని, ముఖ్యంగా సిద్దిపేట సాహిత్యంలో తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో కవులు ఎన్నవెళ్ళి రాజమౌళి, ఉండ్రాళ్ళ రాజేశం, బస్వ రాజ్ కుమార్, శ్రీచరణ్ సాయిదాస్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-తొగుట

సీఎం సహాయ నిధితో పేదలకు మేలు చేకూరు తుందని బీజేపీ మండల సీనియర్ నాయకుడు బాల్ రెడ్డి అన్నారు. ఆదివారం తొగుట మండల కేంద్రానికి చెందిన ఎండి హమ్మద్‌కు రూ.12000, బాల రాజు గౌడ్‌కు రూ.15000 చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలకు సీఎం సహాయనిధి ద్వారా దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు మంజూరు చేసిన చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బూత్ అధ్యక్షుడు బాల్ రెడ్డి, సాగర్ కుమార్, గౌరారం నాగరాజు, కాళ్ల సజాను, కాళ్ల శ్రీను, బి. నాగరాజు, రాజు, రాములు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు రోడ్డు లేక ఇబ్బందులు



నవతెలంగాణ-సిద్దిపేట

మంత్రి హరీశ్ రావు నియోజకవర్గంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు రోడ్డు లేక విద్యార్థినీలు అవస్థలు పడుతున్నారని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు వహబ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు గత 3 సంవత్సరాల నుంచి రోడ్డు లేదన్నారు. రోజు కళాశాలకు వెళ్లడానికి విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది జరుగుతుందన్నారు. పలుమార్లు మంత్రి హరీశ్ రావు వేదికలపైన, సభల్లో సిద్దిపేటను అభివృద్ధి చేశామని అంటారు కానీ, సిద్దిపేట మహిళల డిగ్రీ కళాశాలకు ఇన్ని సంవత్సరాల నుంచి రోడ్డు ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. మంత్రి కళాశాలపైన దృష్టి పెట్టి వెంటనే విద్యార్థుల ఇబ్బందులను తీర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రతాప్, ఆసిఫ్, చింటూ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల పేరెంట్స్ కమిటీ జిల్లా అధ్యక్షులుగా నర్సింలు



నవతెలంగాణ-కొండపాక

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సిద్దిపేట జిల్లా పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడిగా దుద్దెడ గ్రామానికి చెందిన చిట్యాల నర్సింలు, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాముల వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షులు రేగుంట లింగయ్య తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా పేరెంట్స్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన చిట్యాల నరసింహులు మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లాలో ఉన్న టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులు అన్ని రంగాల్లో ముందుండే విధంగా తన శాయ శక్తుల కృషి చేస్తానని, వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడంతో పాటు వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకునే విధంగా తోడ్పాటును అందజేస్తానని తెలిపారు. సిద్దిపేట జిల్లాలో ఉన్న అన్ని గురుకుల పాఠశాలలను సందర్శించి ఆయా పాఠశాలల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటిని స్థానిక మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. అలాగే సిద్దిపేట జిల్లాలోని చేర్యాల గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, దుబ్బాక మండలంలోని రామక్కపేటలో గురుకుల పాఠశాల నూతన భవన నిర్మాణాలకు నిధులు కేటాయించిన మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింగ రావు, అంకిరెడ్డి పల్లి ఉప సర్పంచ్ జాలిగామ నర్సింగ రావు, వర్గల్ మాజీ జడ్పిటిసి పోచయ్య, టీ జీ పీ ఏ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికులు చేసే పనిలో నైపుణ్యం అవసరం



నవతెలంగాణ-జగదేవపూర్

కార్మికులు చేస్తున్న పనిలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ కృష్ణమూర్తి అన్నారు. జగదేవపూర్ మండల కేంద్రంలోని భవన నిర్మాణ, ఎలక్ట్రానిక్, హౌజ్ వైరింగ్, మిషనరీ వెయిటింగ్ డెకరేషన్ తదితర కార్మికులకు నాక్ సంస్థ సహకారంతో బీఎస్ఆర్ కెబిఎస్ జిల్లా అధ్యక్షుడు నర్ర భిక్షపతి ఆధ్వర్యంలో 15 రోజుల పాటు శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణమూర్తి ఆదివారం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తాము చేసే పనిలో నైపుణ్యం పెంచుకోవాలన్నారు. శిక్షణ పొందిన 50 మందికి శిక్షణ పాత్రలను, బ్యాగులను కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణమూర్తి మాట్లాడుతూ కార్మికులు పని చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ రంగంలో మంచి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. తాగి వాహనాలు నడిపితే ప్రమాదం జరుగుతుంది కాబట్టి మద్యం సేవించిన తర్వాత ఎప్పుడూ వాహనం నడపరాదన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఆర్‌కెబిఎస్ మండల అధ్యక్షుడు ఆశయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఎల్లేష్, సుధాకర్, నాక్ సంస్థ అధికారులు శిక్షణ కార్మికులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల సందడి

పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు





నవతెలంగాణ- కొమురవెల్లి

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ కొమురవెల్లి మల్లన్న ఆలయంలో నాల్గవ ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. మల్లన్న నామస్మరణంతో ఆలయ ప్రాంగణం మారుమోగాయి. నాల్గవ వారం సందర్భంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ నిజామాబాద్ జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలి రావడం తో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది. శనివారం రాత్రి నుంచి భారీ సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారికి తలనీలాలు సమర్పించి, స్నానమాచరించి ఒక్కపొద్దులతో మట్టికుండలలో పసుపు బియ్యంతో నైవేద్యం సమర్పించారు. అనంతరం గంగిరేణి చెట్టు వద్ద పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొంత మంది భక్తులు మల్లన్న గుట్టపై రేణుక ఎల్లమ్మకు బోనాలు చెల్లించి మొక్కులు చెల్లించారు. స్వామి ధర్మదర్శనానికి సుమారు 5 గంటల సమయం పట్టింది. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిరుపేద వధువుకు పుస్తె మట్టెలు పంపిణీ



నవతెలంగాణ-రాయపోల్

నిరుపేద వధువుకు పెద్ద న్నలాగా పుస్తె మట్టెలు అంద"జేసి ఆదిపిల్లకు అండగా నిలిచా రు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఇప్ప దయాకర్ ఆదివారం రాయపోల్ మండలం లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబమైన ఎలుకపల్లి లక్ష్మి కూతురు వివాహానికి పుస్తె మట్టెలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబం లక్ష్మి కూతురు రక్షణ వివాహం చేయడానికి ఇబ్బందులు పడుతుంటే గ్రామస్తుల సమాచారం మేరకు తమ వంతు సహకారం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రణం శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పాల రవీందర్ గౌడ్, నాయకులు మల్లారెడ్డి, కల్లూరి శ్రీనివాస్, ఉప సర్పంచ్ శ్రీనివాస్ షాదుల్లా, రజనీకాంత్ రావు, నగేష్, శ్రీనివాస్, కనకయ్య, రాజు, ఆనంద్ రావు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న వివిధ శాఖలకు చెందిన సుమారు డెబ్బై మంది కార్మికులకు వేతనాలు అందక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. డిసెంబర్ నెలతోపాటు జనవరి నెల గడిచినప్పటికి వేతనాలు రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని పలువురు కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు సకాలంలో వేతనాలు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌కు శుభాకాంక్షలు



నవతెలంగాణ-తొగుట

తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మ న్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఎమ్మెల్సీ బండా ప్రకాష్ ముదిరాజ్‌ను ఆదివారం ముదిరాజ్ సంఘం నాయకులు శాసన మండలిలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వెల్పుల స్వామి, ముదిరాజ్ జర్నలిస్ట్ జిల్లా కార్యదర్శి ఉళ్ళెం గాల సాయికుమార్, దమ్మిగారి కనకయ్య, పబ్బతి శ్రీనివాస్ రెడ్డి, ఇప్ప దయాకర్, మెట్ట స్వామి ముది రాజ్ తదితరులు ఉన్నారు.

లచ్చపేటలో కత్తి కార్తీక ప్రత్యేక పూజలు



నవ తెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక పరిధిలోని లచ్చపేట వార్డులో గల మార్కండే య దేవాలయంలో జరుగుతున్న 27వ వార్షికోత్సవ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక గౌడ్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు ఎర్రన్నేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించి "హాత్ సే హాత్ జోడో యాత్ర"ను ప్రారంభించారు. ఆమె వెంట కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఏలూరి కమలాకర్, సంజీవరెడ్డి, సోమేశ్వర్ రెడ్డి పలువురున్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు

మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్



నవతెలంగాణ-మర్కుక్

గ్రామాభివృద్ధే లక్ష్యంగా తాము ముందుకు వెళ్తున్నట్లు మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ అన్నారు. ఆదివారం 'నవతెలంగాణ'తో ఆయన మాట్లాడుతూ గ్రామాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. నిరంతరం ప్రజల్లో ఉండి వారి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పనిచేస్తున్నా మన్నారు. గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో గ్రామాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్తామన్నారు. దీనికి అందరూ సహకరించాలని సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ కోరారు.